జీవనోపాధులు ... భవితవ్యం

నవంబర్ 2016

# బీమా

(ఇన్సూరెన్స్)



'ఎలా' : సమాఖ్యను రిజిష్టర్ చేయడం - 14

ప్రపంచ ఆహార దినోత్సవం! పేదరిక నిర్మూలన దినం! దేశీయ సమూహాల దినం! ఐక్యరాజ్య సమితి దినోత్సవం! ధన్‌తేరాస్, నరక చతుర్దశి, దీపావళి మరియు కార్తీక మాసం శుభాకాంక్షలు! కాలుష్యం తగ్గి వెలుగులు విరజిమ్ముతూ అభివృద్ధి కనిపిస్తుందని ఆశిద్దాం.

2017 జనవరి 1 నుండి ఆంటోనియో గుటెర్రెస్ ఐక్యరాజ్య సమితి నూతన ప్రధాన కార్యదర్శి. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ విజయం.

జయలలిత కోలుకుంటున్నది - పన్నీర్ సెల్వమ్, తమిళనాడు అధికారపీఠంపై తాత్కాలిక బాధ్యతలు చేపడుతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అంతర్గత కుమ్ములాటలలో ఉన్నది. టాటా సంస్థలు సైరస్‌మిస్త్రీని గ్రూపు ఛైర్మన్ పదవి నుండి వెనువెంటనే తొలగించాయి. పెద్ద కార్పోరేట్ సంస్థలలో ఇలా చేయడం అసాధారణం.

తెలంగాణా రాష్ట్రం అధికారికంగా 31 జిల్లాలు ఏర్పాటుచేసింది. ఇంకా ఎక్కువ కావాల్సియుంది. పౌర అధికారులు తగిన విధంగా హేతుబద్ధీకరించబడుతున్నారు. భారతదేశం చైనా వస్తువులను నిషేధించాలా?- అనేచర్చ కొనసాగుతున్నది.

పేదరిక నిర్మూలన ముందుకు తీసుకెళ్లడానికి గాను సమూహాలు తమ కార్యాచరణ ప్రణాళికలు అభివృద్ధి చేసుకోవాలని, తమ వనరులు ఇతర వాస్తవాలు మరియు సామూహిక కార్యాచరణ - సంస్థలను నిర్మించుకోవాలని మనకు తెలుసు. కమ్యూనిటీలు ఏమున్నది, ఏది సాధ్యం, ఎలా సాధ్యం? అనేది చూచుకోవాల్సిన అవసరం ఉంది. విహంగ వీక్షణం. సూక్ష్మవీక్షణం మరియు అనుకరణల ప్రాదేశిక చిత్రాలు పనిచేస్తాయి. మనకు సమాచారం, విశ్లేషించిన సమాచారం మరియు సమాచార విశ్లేషకులు అవసరం. అందుబాటులోని స్థానిక సమాచారం తీసుకుని అనుకరించాల్సిన అవసరం ఉంది. ఆచరణలను చూపాల్సిన అవసరం ఉంది. ఆచరణిస్తున్న వారితో మాట్లాడించాల్సిన అవసరం మనకుంది. ప్రక్రియ వీడియోలను చూపించాల్సిన అవసరం మనకుంది. వ్యక్తిగత ఆకాంక్షలను మరియు సామూహిక జ్ఞానాన్ని సంతులనం చేయాల్సిన అవసరం ఉంది. దీనికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించ వలసిన అవసరముంది. తెలిసిన ప్రకృతి విధానాలతో మనం అమరిక చెందాల్సిన అవసరం ఉంది. దీనికి సహకరించే వ్యక్తులు మనకవసరం. మనకు అంతర్గతంగా మరియు బయటి నుండి నాయకులు అవసరం. వారు బాధిత ప్రజల గురించి ఆలకించి స్పందించే అవసరం ఉంది. అందరి అభిప్రాయాలను / సూచనలను పంచుకోవడానికి వారు తగిన అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. దృష్టికోణాలను నిశ్శబ్దంగా పంచుకోవాల్సిన అవసరం వారికుంది. వివిధ చిన్న గ్రూపులలో పలు విధాలుగా, పలు పద్దతులలో, పలువేదికలపై పనిచేస్తూ విబేధాలను కూడా స్వీకరించాల్సిన అవసరం వారికుంది. నిష్ణాతులు, స్థిరపడిన నాయకులతో అంతిమ పరిష్కారాల గురించి మాట్లాడించాల్సిన అవసరం వారికుంది. ప్రత్యామ్నాయ అభిప్రాయాలను, విమర్శనాత్మక ఆలోచనలను వారు స్వీకరించి కుతర్కవాదులను నియమించు కోవాల్సిన అవసరం ఉంది. దృష్టికోణ నిర్ణయాలు తీసుకోవడం పూర్తికావడానికి ముందు సమావేశాల మధ్య విరామాలు, రాత్రులు గడపడానికి వారు అవకాశాలు కల్పించాలి.

ఇటువంటి నాయకులను సత్వరమే పెద్ద ఎత్తున, అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో 5-10 సం॥రాలలో 20-30 లక్షల మందిని, డివిజన్ మరియు జిల్లా స్థాయిలో 3-5 సం॥లలో 20,000-30,000 మందిని, రాష్ట్ర / జాతీయ స్థాయిలో 2-3 సంవత్సరాలలో, 2,000-3,000 మందిని, 200-300 మంది మార్గదర్శకులను మరియు 40-50 మంది నాయకత్వ మార్గదర్శకులను 1-2 సంవత్సరాలలో అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. ఇది మనం చేయగలమా?

**ఈ నెల మేము నేర్చుకున్నది మనం మన ప్రజలతో పూర్తిగా సానుభూతి పొందలేకపోయాము. అందువలన మేము సాధ్యమైనంతకాలం ప్రజలలో ఒక సభ్యుడిగా జీవించాలి మరియు ఎక్కువ సమయాన్ని ప్రజల యొక్క సాధకబాధకాలలో గడపాలి.**

జీవనోపాధుల ఛత్రంలో విపత్తు ఒక ప్రధానమైన కొలమానం. పలురకాల జీవనోపాధులు, ప్రజాసేవలు, సామాజిక భద్రత మరియు సామాజిక సంబంధాలు విపత్తుల నివారణలో ముఖ్యమైన మార్గాలు. బీమా అనేది మరొక ముఖ్యమైన మార్గం. మనకు జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పశువుల బీమా, జీవరాశుల బీమా, ఆస్థుల బీమా, పంటల బీమా, రుణ బీమా, మొదలగునవి ఉన్నాయి. నెలవారీ, సంవత్సర మరియు ఒకేసారి ప్రీమియంలు చెల్లించగల పాలసీలు మనకున్నాయి. కొన్ని పూర్తిగా రిస్కుపాలసీలు కొన్నింటిలో దానత్వం కల్గినవి. కొన్ని పాలసీలు పింఛను సౌకర్యం కల్గినవి. కొన్ని హైబ్రీడ్ / సమ్మిళిత పలు విపత్తుల పాలసీలు. మరికొన్ని మూడవ పార్టీ బీమాలు. కొన్ని వ్యక్తిగతమైనవి మరికొన్ని ప్రజలతో కూడినవి. వీటిని క్రమబద్ధీకరించడానికి IRDA ఉంది. ప్రజలు నిర్వహించే పరస్పర సహకార సంస్థలు కూడా ఉద్భవిస్తున్నాయి. కొన్నింటిని క్రోడీకరించాల్సిన అవసరం ఉంది. మెరుగైన విపత్తుల నివారణకు కొన్ని పాలసీలకు సలహాలు అవసరం. ఈ నేపథ్యంలో జీవనోపాధులు 'బీమా' గురించి అన్వేశించింది.

RF బెనెడిక్ట్ వ్రాసిన 'ప్యాటరన్స్ ఆఫ్ కల్చర్' పుస్తకాన్ని చదవండి.

అనుబంధాలలో 'సమాఖ్యను రిజిస్ట్రర్ చేయడం ఎలా'?

ఈ సంచికతో 'జీవనోపాధులు' ప్రముఖంగా కొత్త విధానంలో వస్తున్నది. ఫోకస్, వైవిధ్యమైన పలు క్షేత్రస్థాయి జీవనోపాధులు, ఇంటర్వ్యూలు / ప్రత్యేక అధ్యయనాలు ఇందులో భాగం. పుస్తకం మరియు కథ కొనసాగుతాయి. ఎలా? అనేది చర్చిస్తున్నాము.

నూతన డిజైన్‌తో ఈ సంచిక ఉపయోగకరంగా ఉంటుందనే నమ్మకం మరియు ఆశతో !

మీ,

'జీవనోపాధుల'ల బృందం.

**స్పందన**



'నేను మీ పత్రికను చూచాను, ఇది నిజమైన 'జీవనోపాధులు'. ఇది చాలా సమాచార వంతంగా ఉంది. దీనిని అందించినందుకు కృతజ్ఞతలు.

డి. శిరీష, CWS, హైదరాబాద్

జీవనోపాధులు ... భవితవ్యం


ఎడిటర్ : పెండ్యాల మధుసూధన్
సంపాదక సహచర్యం : ఎస్. లక్ష్మణ్
: టి. వేంకటేశ్వర్లు


**ప్రైవేట్ సర్క్యులేషన్ కోసం మాత్రమే**

**'livelihoods' నవంబర్ 2016**
**విషయ సహకారంతో**


Contact:
Pendyala Madhusudhan
Mobile: 9493811409
dhachary101@gmail.com
jeevanopadhulu@gmail.com
www.livelihoods.net.in


**అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ALPL)**
**సహకారంతో**


**చిరునామా**
**జీవనోపాధులు**
HIG - II, B-12, F - 1, APHB కాలనీ
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500 044


## ఈ సంచికలో...

**ప్రత్యేకం**


**ఫోకస్: బీమా (ఇన్సూరెన్స్):** బీమా ప్రజలకొక ప్రమాద విపత్తు నివారణ యాజమాన్య సాధనం. పేద ప్రజల జీవితాలు మరియు జీవనోపాధుల అన్ని అంశాలలో విపత్తు చాలా సర్వసాధారణం. ఆర్ధిక, సాంస్కృతిక, సాంకేతిక మరియు వాతావరణ మార్పులు ప్రజల జీవితాలు మరియు జీవనోపాధులలో అనేక విపత్తులు కొనితెస్తాయి. 6

| | | |
|---|---|---|
| సంపాదకీయం & స్పందన | | 2 |
| క్షేత్రంలో | | 4 |
| పథకం | NSAP పథకం | |
| ప్రజాసేవా సంస్థ | ఈ-పంచాయతీ ఉట్నూర్ | |
| వ్యక్తిగత వ్యాపారం | సైకిల్ పంక్చర్ రిపేర్ షాపు | |
| సాంప్రదాయ సంస్థ | చెంచు కులపంచాయతీ 'నసబ్' | |
| సామాజిక సంస్థ | సావిత్రి భాయి మహిళ బచత్ గట్ | |
| స్వచ్ఛంద సంస్థ | SAPREM (మహారాష్ట్ర) | |
| **సంభాషణలు** | | 10 |
| ఆమ్‌ఆద్మీ | ఉద్యోగ అవకాశం కోరుకుంటున్నాను... | |
| నిస్సహాయ | నా పిల్లల బాగు కోరుకుంటున్నాను... | |
| గ్రామ ఔత్సాహిక వ్యాపారవేత్త | వృద్ధులు ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగాలి... | |
| కమ్యూనిటీ లీడర్ | వృద్ధులకు సేవ చేయాలి... | |
| అభివృద్ధి కార్యకర్త | అణగారిన సమూహాలను అభివృద్ధి చేయడం... | |
| సన్నకారు జీవనోపాధి | రజక వృత్తిదారులు | |
| **పుస్తకాలు** – క్లాసిక్ పుస్తకం : ప్యాటర్న్స్ ఆఫ్ కల్చర్ | | 13 |
| **జీవన తంత్రం** – శీలా మరియు కొండ చిలువ | | 13 |
| 'ఎలా' : సమాఖ్య రిజిష్టర్ చేయడం | | 14 |


గమనిక: ఇందులో ప్రచురించిన రచనల్లోని అభిప్రాయాలు ఆయా రచయితలవి. వాటిని పత్రిక అభిప్రాయాలుగా భావించకూడదు.

పథకం

## NSAP పథకం

ఉట్కూరు గ్రామంలో జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (NSAP) క్రింద వృద్ధులు, అంగవైకల్యం కలవారు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు మరియు బీడి కార్మికులకు మొత్తం 1597 మందికి పింఛన్లు పంపిణీ జరిగింది. వీటిలో వయో వృద్దుల పింఛన్లు – 521, వికలాంగుల పింఛన్లు – 189, వితంతు పింఛన్లు – 614, చేనేత వారి పింఛన్లు – 241 ఉన్నాయి.

ప్రస్తుతం ప్రతినెల 15–20 తేదీల మధ్య పంచాయతి కార్యదర్శి గ్రామ పంచాయతీ దగ్గర పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గతంలో ప్రతినెల ఒకటవ తేదీన పింఛన్ల పంపిణీ జరిగేది. పింఛన్ల పంపిణీ తర్వాత గ్రామ పంచాయతి కార్యదర్శి మిగిలిన మొత్తాన్ని, పింఛన్ల పంపిణీ పట్టికను లబ్దిదారుల సంతకాలతో మరియు వచ్చేనెలకు పింఛన్ల జాబితా మండల పరిషత్ అభివృద్ధి అధికారికి సమర్పిస్తాడు. (ప్రభుత్వం పింఛను డబ్బులను MPDO, NSAP పింఛను బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది. MPDO మండలంలోని పంచాయతి కార్యదర్శులకు చెక్కులపై సంతకాలు చేస్తాడు). ఈ నెలలో 1597 పింఛన్లకు గాను 600 మందికి వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగింది. ప్రభుత్వం రెండు నెలలలో పింఛను దారులందరికీ బ్యాంకు ఖాతాలు తెరిపించే ప్రయత్నంలో ఉంది. ఉట్కూరు గ్రామంలో NSAP క్రింద పింఛన్ కోసం 50 మంది పంచాయతి కార్యదర్శికి దరఖాస్తులు చేసుకున్నారు. పంచాయతి కార్యదర్శి వాటిని MPDOకు సమర్పించాడు. ✷

సాంప్రదాయ సంస్థ

## చెంచు కులపంచాయతి : 'నసబ్'

నాగార్జున సాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్ (NSTR) జోన్‌లో నెలకొన్న పేట్ చెరువు ఒక చెంచుల కుగ్రామం. కర్నూలు జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి 50 కి.మీ.ల దూరంలో ఈ గ్రామం ఉంది. ఈ గ్రామంలో 35 చెంచు కుటుంబాలు నివాసముంటూ జీవనోపాధికోసం అడవులపై ఆధారపడ్డారు. వేట, పశువుల పెంపకం, కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించడం, పెరట్లో కూరగాయల పెంపకం మరియు వ్యవసాయం వీరి ప్రధాన వృత్తులు. చెంచులు నేటికి వస్తుమార్పిడి పద్ధతిని అనుసరిస్తున్నారు. వీరికి, సొంత సాంప్రదాయ సంస్థ 'నసబ్' అని పిలువబడే నలుగురైదుగురు పేట పెద్దమనుషులతో కూడిన కుల పంచాయతీ ఉంది. వీరి వయస్సు, తెలివి, సమస్యలు పరిష్కరించేనేర్పు వలన అందరికీ గౌరవనీయులుగా ఉంటారు. 'నసబ్ ' చెంచుల సాంప్రదాయాలు, సంస్కృతులను కాపాడుతూ విభేధాలను పరిష్కరించుతుంది. 'నసబ్'కు పేటపై పూర్తి అధికారం కలిగి వీరు "పెద్ద మనుషులు"గా పిలువబడుతారు. దీనికి గ్రామ పెద్ద (రాజు) అధ్యక్షత వహిస్తాడు. ఈ స్థానం వంశపారంపర్యంగా వస్తుంది. ఇది సామాజిక, మతపరమైన అంశాలు, సమస్యలను మరియు వివిధ విభేధాలను చేపడుతుంది. తీర్పు వెలువడిన తర్వాత తీర్పును ఉల్లంఘించిన వారు జరిమాన కట్టాలి లేదా గ్రామ ప్రజలకు విందు ఏర్పాటుచేయాలి. ఒక వేళ ఎటువంటి ప్రత్యక్ష సాక్ష్యం దొరకకపోతే ఆరోపించబడిన వారు సలసలకాగే నీటిలో చేతులు పెట్టి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి. మారుతున్న కాలంలో నసబ్ ఈ సంప్రదాయాలకు అతీతంగా ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేకూర్చుకోవడంలో ముఖ్యపాత్రను పోషిస్తుంది. ✷

ప్రజాసేవా సంస్థ

## ఈ-పంచాయతీ :ఉట్కూర్

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉట్కూరు గ్రామంలో 2015 జనవరి 1 నుండి ఈ – పంచాయతీని ప్రారంభించారు. ఈ – పంచాయతీ నిర్వహణ కాంట్రాక్టును కార్వే ఏజెన్సీకి ఒక సంవత్సరానికి అప్పజెప్పారు. నెలకు రూ. 10,000 జీతంతో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించి, వెబ్‌సైట్ మరియు అంతర్జాల సౌకర్యంతో కార్యాలయం ప్రారంభించారు. ఈ పంచాయితీ ప్రధాన ఉద్దేశ్యం ఏరియా రేఖా చిత్రం సమాచార సేకరణ, గ్రామ పంచాయతీ జమా ఖర్చులు మరియు నిధుల వివరాలు, ప్రభుత్వ భూములు వివరాలు, మరియు పర్యాటక సమాచారం సేకరించడం. ఈ సేవలు ప్రియా సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ పంచాయతీకి సమకూర్చబడుతాయి.

ఈ – పంచాయతి ఆపరేటర్ గ్రామ రేఖాచిత్రం సమాచారం, ప్రభుత్వ భూముల వివరాలు, గ్రామ పంచాయతీ ఆదాయం, ఖర్చులు మరియు ఉట్కూరు గ్రామ పర్యాటక సమాచారంతో కూడిన డేటాబేస్‌ను ఏర్పరచాడు. 2016 జనవరి తేదీతో కార్వే ఏజెన్సీ కాంట్రాక్టు సమయం ముగిసినప్పటికీ ప్రభుత్వం దానిని పొడగించలేదు. ప్రభుత్వం ఈ – పంచాయతీ యాజమాన్యంను MPDO కు అప్పగించి 17 ఇతర గ్రామాలను ఉట్కూరు ఈ – పంచాయతికి జత చేసింది. ప్రస్తుతం ఉట్కూరు ఈ – పంచాయతి ఉట్కూరు కార్యాలయం ద్వారా పనిచేస్తున్నది. ✷

వ్యక్తిగత వ్యాపారం

## సైకిల్ పంక్చర్ రిపేరు షాపు

ఉట్కూరు గ్రామంలో హైమత్ 2014 నుండి సైకిల్ పంక్చర్ రిపేరు షాపును నడుపుతున్నాడు. ఈ షాపులో సైకిలు మరియు ఇతర ద్విచక్ర వాహనాల పంక్చర్లకు రిపేరు చేస్తాడు. ద్విచక్ర వాహనాలకు కొత్త ట్యూబులను కూడా బిగించుతాడు. షాపును ఉ.9 గం॥ల నుండి సా.5 గం॥ల వరకు నడుపుతాడు. సైకిల్ పంక్చర్‌కు రూ.5/– మరియు మోటారు సైకిల్ పంక్చర్‌కు రూ.15/–ల చొప్పున ఛార్జీ చేస్తాడు. సరాసరిగా చలి, వాన కాలంలలో రూ.500/– మరియు వేసవి కాలంలో రూ.1000/–రోజుకు సంపాదిస్తాడు. సెలవులు, పనిలేని రోజులు పోనూ నెలకు రూ.10,000/–లు సంపాదిస్తాడు. 2 నెలలకొకసారి హైమత్ రూ.750/– విలువగల ట్యూబులు, జిగురు వంటి సామాగ్రిని నారాయణ్‌పేట నుండి ఖరీదు చేస్తాడు. నెలకు కరెంట్ బిల్లు రూ.300/– నుండి రూ.500/– వరకు మరియు రూ.300/– షాపు నెల కిరాయిని చెల్లిస్తాడు. మొత్తంగా నెలకు రూ.1175/– తన వ్యాపారం మీద ఖర్చుచేస్తాడు.

ఇంతకు ముందు హైమత్ 3 సోదరులు ఈ షాపుని నిర్వహించేవారు. సరిపడా ఆదాయం రాక వారు 2014లో పని కోసం దుబాయి వెళ్లారు. అప్పుడు హైమత్ హైదరాబాద్‌లో ఒక దుకాణంలో మెకానిక్ గా పని చేసేవాడు. సోదరులు దుబాయికి వెళ్లడంతో హైమత్ తన ఉద్యోగం వదిలి ఉట్కూరు వచ్చి సైకిల్ పంక్చర్ రిపేరు వ్యాపారం నడపసాగాడు. హైమత్ ప్రభుత్వం నుండి ఆధార్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు మరియు రేషన్ కార్డు సంపాదించాడు. 4 చక్రాల పంక్చర్ రిపేరు కూడా చేపట్టి దాని ద్వారా వ్యాపారం పెంచుకోవడానికి అప్పుకావాలనుకుంటున్నాడు. ✷

సామాజిక సంస్థ

## సావిత్రి భాయి మహిళా బచత్ గట్

సావిత్రిభాయి మహిళా బచత్ గట్ అనే వృద్ధుల స్వయం సహాయక సంఘం (ESHG) మహారాష్ట్ర లోని చంద్రాపూర్ జిల్లా వరోరా బ్లాక్‌లోని వంధాలి గ్రామంలో ఉంది. ఈ సంఘం 2015 జూన్ 16న 13 మందితో ఏర్పడింది. ఈ ESHG ప్రస్తుత అధ్యక్షురాలు ఆశాపుండాలి చౌదరి మరియు కార్యదర్శి వైశాలి పురుషోత్తం ఠాకోర్. ఈ గ్రూపు సమావేశాలు నెలకొకసారి నిర్వహించుతూ సభ్యుల పొదుపు, అప్పులు, వృద్ధుల ఆరోగ్య సమస్యలు, ఇతరములు చర్చించుకుంటారు.

ప్రతి సభ్యురాలు వారానికి రూ. 10/- పొదుపు చేస్తారు. ఈ ESHG ప్రధానమైన కార్యక్రమాలు పొదుపు, అంతర్గత అప్పులు, వడ్డీ వసూలు, పుస్తకాల నిర్వహణ, అనేక సాంఘిక కార్యక్రమాలపై చర్చించడం, గ్రూపు కార్యక్రమాలు, ఆరోగ్య సమస్యలు ఇతరములు. సంఘాన్ని బలోపేతం చేయడం, అందరు గ్రూపు సభ్యులు తప్పని సరిగా సమావేశాలకు హాజరు కావడం, ఒక వేళ హాజరుకాలేని సభ్యురాలు రూ. 2/- జరిమానా చెల్లించడం, అందరు సభ్యులు చురుకుగా సమావేశాలలో పాల్గొంటూ చర్చించాలని ఈ సంఘం స్వంత నియమాలు రూపొందించుకుంది. పొదుపు పుస్తకం, మినిట్స్ పుస్తకం, అప్పుల పుస్తకం, నగదు పుస్తకం మరియు ఓచర్ మొదలగు పుస్తకాలను నిర్వహిస్తారు. పుస్తకాలను గ్రామ వాలంటీర్ వ్రాస్తుంది. ఈ సంఘానికి ప్రాజెక్టు విభాగంలో (22/25) 'ఏ' గ్రేడ్ వచ్చింది. ESHG దృక్పథం, యాజమాన్యం, నాయకత్వం, నిబంధనలు మరియు పుస్తకాల నిర్వహణ వంటి రంగాలలో ఈ సంఘం శిక్షణలు పొందింది.

సావిత్రి భాయి మహిళా బచత్ గట్ SBI వరోరా బ్రాంచితో బ్యాంకులింకేజి ఏర్పరచుకుంది. 2016 ఫిబ్రవరి నాటికి ఈ సంఘానికి రూ. 5,850/- పొదుపు మొత్తం ఉంది. ఈ పొదుపు మొత్తం నుండి ప్రతి సభ్యురాలికి గరిష్టంగా రూ. 2,000/- అంతర్గత అప్పులు ఇస్తున్నారు. దీనిపై 2% వడ్డీ వసూలు చేస్తుంది. సంఘం సభ్యులందరూ వాయిదాల పద్ధతిలో చెల్లింపులు చేస్తారు.

ఈ సంఘం గ్రామసంఘం (VO) మరియు సభ్యుల సహకారంతో పప్పుల మిల్లును ఏర్పరచాలనేది భవిష్యప్రణాళిక. ప్రస్తుతానికి సంఘం సభ్యులు వారి వారి పొదుపు, అందరు ఒకటేనన్న భావన, ప్రయోజకులమన్న భావనతో స్థిరపడ్డామన్న భావన సాధించారు. ఈ ESHG సంఘంలో లేని ఇతర వృద్ధులకు వారి సమస్యలు, హక్కులు మరియు రావల్సిన సౌకర్యాల గురించి చైతన్యం కల్పించాలని సావిత్రి భాయి మహిళా బచత్ గట్ కోరుకుంటుంది. ✷

స్వచ్ఛంద సంస్థ

## SAPREM (మహారాష్ట్ర)

సోషల్ ఆస్పిరేషన్ పర్ పార్టిసిపేటరీ రిఫార్మ్స్ బై ఎవాల్వ్‌డ్ మాన్‌పవర్ (SAPREM) అనేది మహారాష్ట్రలో 1998లో కొందరు సంఘసేవకుల చేత ఏర్పాటు చేయబడిన స్వచ్ఛంద సంస్థ - ఇది సంఘసేవ అందిస్తున్నది. ఇది విద్య, ఆరోగ్యం మరియు సంఘం సాధికారత రంగాలలో మహారాష్ట్ర గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పనిచేస్తున్నది. "సామాజిక-ఆర్థిక సమస్యల ప్రభావాన్ని గుర్తించి సంఘంలో మానవాళి సాంఘిక, విద్య మరియు ఆర్థిక బాగుకోసం సంఘ సభ్యుల భాగస్వామ్య పద్ధతుల ద్వారా సమూహం పాల్గొనేలా పనిచేయడం" SAPREM యొక్క లక్ష్యం (mission). SAPREMసొసైటి రిజిస్ట్రేషన్ చట్టం, పబ్లిక్ ట్రస్టు చట్టం క్రింద నమోదు చేయబడి FCRA సర్టిఫికెట్ కల్గియున్నది. విద్యా అభివృద్ధి కోసం నియత, అనియత విద్యా ప్రాజెక్టులు రూపొందించడం, సాంఘికంగా, ఆర్థికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన వారికి అభివృద్ధి పథకాలు, ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపరచడానికి వైద్య విద్య, మెరుగైన సాధారణ ఆరోగ్యం కల్పించడం, రక్షిత త్రాగునీటి పథకాలు కల్పించడం; నీటి కాలుష్యంపై అవగాహన కల్పించడం, సౌకర్యాలు సృష్టించడం ద్వారా SAPREM సమాజాన్ని ఉద్ధరించాలన్న లక్ష్యాలు కల్గియున్నది.

ఉదా:- వ్యక్తిగత మరుగుదొడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, అసంఘటిత కార్మికుల అభివృద్ధి కోసం నిర్మాణాత్మక ప్రణాళికలు, సమాజం నుండి మూఢనమ్మకాలు, మరియు చెడు ప్రవర్తనను నిర్మూలించడం మరియు నిషేధాలను రద్దు చేసి మానసిక అనారోగ్యం గురించిన చైతన్యం కల్పించడం. వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలు, మహిళా న్యాయసహాయం, మరియు కౌన్సిలింగ్ కేంద్రం, పోలియో నిర్మూలన కార్యక్రమం, HIV-AIDS కౌన్సిలింగ్ కేంద్రం మరియు ప్రపంచ ఎయిడ్స్ దినం

పాటించడం, వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమం, కళ్యాణ్ - డొంబివాలి మున్సిపల్ కార్పోరేషన్ ద్వారా MMRDA నిధులతో నిర్మల్ MMR ప్రాజెక్టు వంటి పారిశుద్ధ్య కార్యక్రమం; అంధేరిలో 700 మంది పిల్లలకు బాల్వాడి పాఠశాల, గ్రామీణ మరియు ఆదివాసి పిల్లల కోసం బిర్వాడి, షాహాపూర్ లలో ప్రాథమిక ఆంగ్లమాధ్యమ పాఠశాల ఉపకార వేతనాల పథకం; విద్యార్థులకు హాస్టల్; బాల్వాడి పిల్లలకు పౌష్టికాహార పథకం; స్వయం సహాయ బృందాల అభివృద్ధి పథకం; కంటి పరీక్షలు మరియు శుక్లాల శస్త్ర చికిత్సలు; డొంబివాలి లో మానసిక వికలాంగ పిల్లలకు ప్రత్యేక పాఠశాల, బిర్వాడి మరియు అంధేరి ప్రాంతాలలో ఆదాయకల్పన కార్యక్రమాలు; 18-45 సం॥రాల మధ్య వయస్సు మహిళలకు సానుకూల అవసరమైన నైపుణ్యాలు కల్పిస్తూ మహిళా సాధికారత; థానే జిల్లాలోని సాయినగర్, బిర్వాడి లలో మహారాష్ట్ర విద్యా విభాగం అంగీకరించిన నియతవిద్యా పథకంలో ఆంగ్ల మాధ్యమ పాఠశాల వంటి పలుకార్యక్రమాలు SAPREM నిర్వహిస్తున్నది. SAPREM కార్యక్రమాల ద్వారా మహారాష్ట్రలో 16,000 మంది ప్రజలు లబ్దిపొందారు. ✷

## ఫోకస్

# బీమా (ఇన్సూరెన్స్)

**బీమా (ఇన్సూరెన్స్) ప్రజలకొక ప్రమాద విపత్తు నివారణ యాజమాన్య సాధనం. పేద ప్రజల జీవితాలు మరియు జీవనోపాధుల అన్ని అంశాలలో విపత్తు చాలా సర్వసాధారణం. ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక మరియు వాతావరణ మార్పులు ప్రజల జీవితాలు మరియు జీవనోపాధులలో అనేక విపత్తులు కొనితెస్తాయి. మన దేశంలో 94% శ్రామిక శక్తి అసంఘటిత రంగంలో పనిచేస్తూ ఎటువంటి సాంఘిక, ఆర్థిక రక్షణలు లేనందున వారి జీవనోపాధులు వాతావరణ మార్పులకు సులభంగా ప్రభావితమౌతున్నాయి. ఈ పరిస్థితి విపత్తులనెదుర్కొవడానికి 100% బీమా కోరుతున్నది. విచారకరంగా మనదేశంలో బీమా పేదప్రజల ఇండ్లకు పెద్ద యెత్తున చేరడంలేదు. బీమా అనేది ప్రధానంగా మధ్యతరగతి మరియు ఉన్నతవర్గాల ప్రజలకే పరిమితమైనది. మొత్తంగా కేవలం 30% ప్రజానీకం మాత్రమే బీమా పథకాలలో పదో ఒకటి పొందుతున్నారు. అంతర్జాతీయ విశ్లేషణ కంపెనీ క్రిసిల్ 2015 నివేదిక ప్రకారం – మన దేశంలో తలసరి బీమా వార్షికా దాయంలో 1% కంటే తక్కువగా ఉంది. మరియు అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా సంయుక్త రాష్ట్రాలు (USA)మరియు యునైటెడ్ కింగ్‌డమ్ (UK) లలో 7% మరియు 12% ఉంది. ఈ నేపథ్యంలో "జీవనోపాధులు" బీమా మరియు దాని ప్రభావాల గురించి అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తుంది.**

ప్రజలకు తమ జీవనోపాధుల నుండి విపత్తులు లేని భరోసా కలిగిన ఆధాయం అవసరం. కానీ వ్యవసాయం, పరిశ్రమలు, కలపేతర అటవీ ఉత్పత్తులు, చేపల పెంపకం, నిర్మాణం, చేనేతపని, వేతన కూలీలు, వృత్తి పనులు, మరియు పశుపోషణ వాటి జీవనోపాధులలో ఆదాయానికి సంబంధించిన హామీ లేదు. కరువు, వరదలు, భూకంపాలు, పంటచీడపీడలు, అటవీవిధానాలు, సామాజిక అశాంతి, పెద్ద వారితో పోటీ, సాంకేతికలో మార్పులు, మార్కెట్ ధరలలో ఒడిదుడుకులు మొదలగు ప్రమాదాల వలన ప్రజలు భరోసా కల్గిన ఆదాయం పొందలేక పోవచ్చు. ఇటువంటి విపత్తుల వలన ప్రజలు చాలాసార్లు ఆదాయాన్ని ఆస్థులను, ఇండ్లను, ఉద్యోగాలను మరియు జీవరాశులను నష్టపోవచ్చు.

ప్రజలు ప్రమాదాల వలన పలు ప్రభావాలను చవిచూస్తూ మరియు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ఇది వారిని దారిద్ర్యం అనే విషవలయంలోనికి నెట్టివేస్తున్నది. కుటుంబంలో సంపాదనాపరున్ని కోల్పోవడం లేదా జీవనోపాధిని కోల్పోవడం కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితిని, సాంఘిక స్థితిని, జీవనప్రమాణాన్ని, ఆరోగ్య రక్షణను, పోషకాహార సేవనం, విద్యార్థుల చదువు వంటి వాటిని ప్రభావితం చేస్తూ కుటుంబాన్ని మరింత దారిద్ర్యం లోనికి నెట్టుతుంది. ఎటువంటి సాంఘిక బాధ్యత పథకాలు లేకపోవడం మరియు తరచుగా ప్రమాదాలు జరగడం ప్రజలు జీవితాలను మరింత నిస్సహాయం చేస్తుంది. అధ్వాన్నమైన ఆర్థిక పరిస్థితులు, వత్తిడి, అనారోగ్యాన్ని పెంచుతున్నందున ప్రజల మెరుగైన ఆరోగ్యంతో జీవితాంతం గడపడానికి భరోసాగల్గిన ఆదాయం అవసరం. పలు బీమా పథకాలు ప్రజలను కాపాడుతూ వారికి భద్రమైన జీవితాలను నిర్ధారిస్తాయి. జీవన, జీవనోపాధులు, ఆస్థులు, జీవరాశులు, పంటలు, ఆరోగ్యం, పరిశ్రమలు, వాహనాలు, వస్తువులు, వృద్ధాప్యంలో జీవనభద్రత వంటి పలు రంగాలలో వారికి బీమా అవసరం.

మనదేశ ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం – పొదుపుల సమీకరణ, పెట్టుబడులు పెట్టడం, మార్కెట్లను స్థిరీకరించడం మరియు ఆర్థిక, సాంఘిక ప్రమాదాలను నియంత్రించడం, ద్వారా – ప్రముఖ పాత్ర పోషించింది. భారత ప్రభుత్వం దేశాభివృద్ధిలో బీమారంగం ప్రాధాన్యతను గుర్తించుతూ పలుచొరవలను ఈ రంగంలో రూపొందించింది. ముఖ్యంగా బీమా నియంత్రణ మరియు అభివృద్ధి అధికారం చట్టం (IRDAI), 1993 రూపొందించిన 1993 నాటి నుండి భీమారంగం పలు మార్పులు చూసింది. అంతకు ముందు భారతీయ జీవిత బీమా సంస్థ (LIC) మరియు భారతీయ సాధారణ బీమా సంస్థ (GIC) అనే రెండు ప్రధాన కంపెనీలు మాత్రమే ఉండేవి. IRDAI చట్టంతో భారత ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలను బీమా రంగంలోనికి అనుమతించడమే కాకుండ తర్వాత విదేశీ కంపెనీలను కూడా ఈ రంగంలోనికి అనుమతించింది. భారత ప్రభుత్వం 2015 లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (FDI) పరిమితిని 26%–49% వరకు పెంచింది. దీనితో రూ. 8031/– కోట్లు బీమారంగంలోనికి వచ్చాయి. మనదేశంలో బీమారంగం 100 సంవత్సరాల పాత చరిత్ర గలిగి క్రింద వివరించిన ముఖ్యమైన ఎన్నో మైలురాళ్లను తన ప్రయాణంలో దాటింది.

| సంవత్సరం | ముఖ్యమైన సంఘటనలు |
|---|---|
| 1912 | జీవితబీమా కంపెనీల చట్టం పాసయ్యింది. |
| 1938 | బీమా చట్టం, 1938, బీమా వ్యాపారంపై రాజ్యానికి గట్టి నియంత్రణ కల్పించింది. |
| 1959 | జీవితబీమా పూర్తిగా జాతీయం చేయబడింది. మొత్తం 245 బీమా కంపెనీలను భారతీయ జీవిత బీమా కార్పోరేషన్ (LIC)లో కలిపేశారు. |
| 1957 | సాధారణ బీమా సమితి (GIC)ని బీమా వ్యాపారంలో నిబంధనలు నియమాలను రూపొందించడానికి గాను ఏర్పాటు చేశారు. |
| 1968 | బీమా చట్టం – 1938 ను పెట్టుబడులను నియంత్రించడానికి గాను సవరించారు. టారిఫ్ సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. |
| 1972 | సాధారణబీమా వ్యాపార చట్టం రూపొందింది. ఈ చట్టం ద్వారా జాతీయ బీమా కంపెనీ లిమిటెడ్ (NICL), ఓరియంటల్ బీమా కంపెనీ.లి. (OICL), న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (NIACL) & యునైటెడ్ ఇండియా బీమా కంపెనీ లిమిటెడ్ (UIICL) ఏర్పాటుకు అవకాశం కల్గింది. |
| 1993 | భారత ప్రభుత్వం ఆర్.ఎన్. మల్హోత్ర కమిటిని ఏర్పరచి బీమా రంగంలో సూచనలు చేయమని కోరింది. |
| 1996 | బీమా నియంత్రణ మరియు అభివృద్ధి ఆథారిటి (ఐఆర్‌డిఎఐ) ఏర్పాటు చేయబడింది. ఇది బీమా పరిశ్రమను క్రమబద్ధీకరించి అభివృద్ధి చేయడానికి ఏర్పాటు చేశారు. |
| 2004 | 21 ప్రైవేటు బీమాకంపెనీలు బీమాపరిశ్రమలోనికి ప్రవేశించాయి. |
| 2014 | భారత ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) 26% నుండి 49% వరకు బీమారంగంలో పెంచింది. |

"ప్రస్తుతం బీమారంగపరిశ్రమలో చాలా ప్రైవేటు, ప్రభుత్వరంగ కంపెనీలు పనిచేస్తున్నాయి. ఈ కంపెనీలు వివిధ రకాలైన బీమాపథకాలను అమలు చేస్తూ పాలసీదారులకు అనేకమైన ఉత్పత్తులను అందించుతున్నాయి. బీమాపథకాలను జీవితబీమా పథకాలు, సాధారణ (జీవితేతర) బీమాపథకాలుగా 2 రకాలుగా విభజించవచ్చు. 2016 నాటికి బీమారంగంలో మొత్తంగా 53 బీమా కంపెనీలు (ప్రభుత్వ, ప్రైవేటురంగంలో కలిపి) వీటిలో 24 జీవిత బీమా కంపెనీలు, 29 జీవితేతర బీమా లేదా నిర్ణీతకాల బీమా (జీవితప్రమాద కవరేజికోసం) మరియు పొదుపు బీమా అనే మూడు రకాలుగా ఉన్నాయి. జీవితబీమాలో పాలసీదారుడు తన వయస్సు, చెల్లించగల శక్తిని బట్టి కొంతమొత్తం ప్రతి సంవత్సరం చెల్లించాల్సి యుంటుంది. బీమామొత్తం ప్రీమియం మొత్తంపై ఆధారపడి యుంటుంది. బీమాకంపెనీ బీమాచేసిన మొత్తాన్ని పాలసీదారునికి లేదా వారి నామినికి, అతడు/ఆమె సహజ/ప్రమాదవశాత్తు మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా, చెల్లిస్తుంది. వ్యక్తి కోల్పోయే సంపాదనశక్తి వలన ఏర్పడే ఆర్థిక అభద్రత నుండి ఆ కుటుంబాన్ని ఈ బీమాపాలసీ కాపాడుతుంది. అయితే ఈ పాలసీలో పాలసీదారుడు ప్రత్యేకించిన సమయంలోపల ప్రమాదాన్ని ఎదుర్కొంటే చెల్లించిన బీమామొత్తం పొందలేక పోవచ్చు.

పొదుపు బీమాపాలసీ లేదా ఎండోమెంటు బీమాపాలసీలో పాలసీదారుడు చెల్లించిన మొత్తాన్ని కూడా బీమామొత్తంలో కలిపి పొందుతారు. బీమా కంపెనీలు పాలసీదారులకు ప్రత్యేకించిన సమయానికొకసారి డబ్బును తిరిగి చెల్లిస్తాయి. పాలసీదారుల వయస్సును బట్టి 12 నుండి 35 సం॥రాల కాలాన్ని చెల్లింపు సమయంగా రూపొందిస్తారు. ఉదా॥ 50 సం॥ల వయస్సుగల వ్యక్తి, 35 సం॥రాల పరిమితి గల పాలసీని పొందలేడు. ఒక రోజు పాప నుండి 55 సం॥ల వయస్సు గల వారికి, వారి వయస్సును బట్టి పాలసీలు రూపొందిస్తారు. పాలసీదారులు తమ వయస్సు గుర్తింపు కోసం పాఠశాల సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, మరియు డ్రైవింగ్ లైసెన్స్ వంటి అధీకృత ధృవపత్రాలను సమర్పించాల్సి యుంటుంది. కొన్ని బీమా ఉత్పత్తులు ప్రీమియంసమయం తర్వాత నెలవారి పింఛను యిస్తాయి. ప్రీమియం మొత్తంపై ఆధారపడి పింఛను ఉంటుంది.

ప్రీమియం చెల్లింపులలో ఒకేసారిచెల్లింపు, స్వల్పకాలం, మీడియం, దీర్ఘకాలచెల్లింపు పద్దతులు ఉన్నాయి. పాలసీదారులు వారి చెల్లింపుశక్తి, సంపాదనాపద్ధతిని బట్టి ప్రీమియంచెల్లింపుల పద్ధతిని ఎన్నుకోవచ్చు. ప్రీమియంమొత్తం చెల్లింపుకాలంను బట్టి నిర్ణయించబడుతుంది.

| జీవిత బీమాదారులు | జీవితేతర బీమాదారులు |
|---|---|
| **ప్రభుత్వరంగం** | **ప్రభుత్వరంగం** |
| భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ లిమిటెడ్. | జాతీయ బీమా కంపెనీ లిమిటెడ్ |
| | ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్. |
| | ది ఓరియంటల్ బీమా కంపెనీ లిమిటెడ్ |
| | యునైటెడ్ ఇండియా బీమా కంపెనీ లిమిటెడ్. |
| **ప్రైవేటు రంగం** | **ప్రైవేటు రంగం** |
| యేగాన్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్ | వ్యవసాయ బీమా కంపెనీ ఇండియా లిమిటెడ్. |
| అవివా జీవితబీమా కంపెనీ లిమిటెడ్ | అపోలో మునిచ్ ఆరోగ్యబీమా కంపెనీ లిమిటెడ్. |
| బజాజ్ అలియాంజ్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | భారతి అలియాంజ్ సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| భారతి ఆక్సా జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | భారతి అలియాంజ్ సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| బిర్లాసన్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | చోళమండలం MS సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| కెనరా HDFC ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | CignaTTK ఆరోగ్యబీమా కంపెనీ లిమిటెడ్. |
| DHFL ప్రమెరికా జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్. |
| ఎడివెయిన్స్ టోకియా జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | ఫ్యూచర్ జనరల్ ఇండియా బీమా కంపెనీ లిమిటెడ్. |
| ఎక్సైడ్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | HDFC ERGO సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| ఫ్యూచర్ జనరాలి ఇండియా జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | ICICI లంబార్డ్ సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| HDFC స్టాండర్డ్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | IFFCO Tokio సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| ICICI ప్రుడెన్సియల్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | L & T సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| IDBI ఫెడరల్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | లిబర్టి వీడియోకాన్ సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| ఇండియాఫస్ట్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | మాగ్మా HDI సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| కోటక్ మహేంద్రా ఓల్డ్ మ్యూచువల్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | Max Bupa ఆరోగ్యబీమా కంపెనీ లిమిటెడ్. |
| మ్యాక్స్ న్యూయార్క్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | రహేజా Q B E సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| PNB మెట్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | రిలయన్స్ సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| రిలయన్స్ జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | రెలిగేర్ ఆరోగ్యబీమా కంపెనీ లిమిటెడ్. |
| సహారా ఇండియా జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | రాయల్ సుందరమ్ అలియన్స్ బీమా కంపెనీ లిమిటెడ్. |
| SBI జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | SBI సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| శ్రీరాం జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | శ్రీరాం సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| స్టార్ యూనియన్ దాయ్-ల్చి జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | స్టార్ హెల్త్ అండ్ అలైడ్ బీమా కంపెనీ లిమిటెడ్. |
| TataAIG జీవితబీమా కంపెనీ లిమిటెడ్. | Tata AIG సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |
| కోటక్ మహేంద్ర సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. | యూనివర్సల్ సొంపో సాధారణబీమా కంపెనీ లిమిటెడ్. |

జీవితబీమాలో బీమామొత్తాన్ని తీసుకోవడానికి పాలసీదారు లేదా నామినీ బీమాకంపెనీకి ప్రమాదం జరిగిన లేదా మరణం ఘటన గురించి పాలసీ నెంబరు, ప్రమాద వివరాలతో 15రోజులలోగా బీమా కంపెనీ కార్యాలయానికి సమాచారం అందించి ఉత్తరం వ్రాయాలి. పాలసీదారుని మరణం జరిగితే వారి నామినీ సంబంధిత అధికారినుండి మరణధృవీకరణపత్రం, న్యాయబద్ధ వారసత్వపత్రం, ఆధార్‌కార్డు, మరియు బ్యాంకుఖాతా వివరాలు బీమాకంపెనీ కార్యాలయంలో సమర్పించాలి. ఈ వాదన పరిష్కారానికి నెలవరకు సమయం తీసుకుంటుంది. వాదనల్లో రెండురకాలు ఒకటి ముందస్తు వాదనలు మరియు ముందస్తుకాని వాదనలు. పాలసీ తీసుకున్న లేక పాలసీ పునరుద్ధరణకు మూడు సంవత్సరాల ముందు  మరణించితే దానిని ముందస్తు వాదన అంటారు. ముందస్తువాదనలలో బీమాఅధికారులు తీవ్రమైన పరిశీలన చేస్తారు. పాలసీ తీసుకునే సమయానికి మూడు సంవత్సరాల తర్వాత మరణం జరిగితే చేసే వాదనను ముందస్తుకాని వాదన అంటారు. అవకతవకలను ముందస్తు వాదనలుగా వ్యవహరిస్తారు. పాలసీదారులు నియమ నిబంధనలను అనుసరించి బాకీ మొత్తాలను, వడ్డీ మరియు అపరాధరుసుంతో తమ పాలసీలను పునరుద్దరించుకోవచ్చు.

సాధారణబీమా విషయంలో ప్రజలు ఆస్థులు, నిల్వలు, పంటలు, జీవరాశులు, పరిశ్రమలు, అప్పులు, ఆరోగ్య సమస్యలు మొదలగు పలు అంశాలలో బీమా చేయిస్తారు. అంతేకాక ప్రజలు టెలివిజన్, రిఫ్రిజిలేటర్, ఇల్లు, ఫోన్లు, వాహనాలు మొదలగు వాటిపై కూడా బీమా చేయిస్తారు. ఈ వస్తువులను అమ్మేటప్పుడే అమ్మకందారు వీటిపై బీమాసొమ్ము తగ్గించుతారు. ఇతర వస్తువులపై కొనుగోలుదారు విపత్తు అంశాలైన కరువులు, దొంగతనాలు, ప్రమాదం మొ॥లగు అంశాలపై నిర్ణయించుకోవాల్సి యుంటుంది. ఒక వేళ బీమా చేసిన వస్తువు పాడైతే నియమనిబంధనల ప్రకారం పాలసీదారుడు మరొక వస్తువు పొందుతాడు. వాహనబీమా అనేది దేశంలో తప్పనిసరి చేయబడిన జీవనేతర బీమా పరిశ్రమలో గణనీయమైన భాగం 43% (2013-14) ఆక్రమించింది. ఈ రోజులలో అనారోగ్య పరిస్థితులు, పోషకాహార లేమి, అనారోగ్య జీవన విధానం, ఆరోగ్యం గురించి తగిన ముందు జాగ్రత్తలు లేకపోవడం మరియు వాతావరణమార్పుల వలన ప్రజలు ఎక్కువ సార్లు తరచుగా అనారోగ్యం బారిన పడుతున్నారు. వారికి ఉచితమైన, నాణ్యమైన వైద్యచికిత్సలు అవసరంతో పాటు కోల్పోయిన పనిదినాలకు నష్టపరిహారం కావాల్సియుంది. 2016 జాతీయ నమూనా సర్వే (NSS) ప్రకారం, మన దేశంలో 80% ప్రజలకు ఎటువంటి ఆరోగ్యబీమా కవరేజి లేదు. నాణ్యమైన, సకాలంలో వైద్యరక్షణ పొందడం అధికారం కానక్కర లేదు. ఇది ప్రతిపౌరుని యొక్క ప్రాథమికహక్కుగా మారాలి. సమాజం ప్రతి ఒక్కరికి వారి ఆర్థికపరిస్థితిని బట్టి వివక్షలేకుండ ఆరోగ్యసేవలు తప్పనిసరిగా కల్పించాలి. జీవితబీమాలో ఆరోగ్యబీమా అనేది మరొక విభాగం. ఆరోగ్యబీమాలో పాలసీదారుడు అతని / ఆమె వయస్సు మరియు చెల్లించేస్థోమతను బట్టి కొంతమొత్తం చెల్లించాల్సి యుంటుంది. ప్రీమియం మొత్తాన్ని బట్టి బీమామొత్తం నిర్ణయించబడుతుంది. ఈ పాలసీ తీసుకున్న తర్వాత మొదటి సంవత్సరంలో బీమాకంపెనీ కొన్ని పరిమితమైన వ్యాధులను, తర్వాత క్రమంగా ఎక్కువ వ్యాధులను బీమాకవరేజీ లిస్టులో అనుమతిస్తుంది. బీమాకంపెనీలు వైద్యచికిత్సలకు బీమామొత్తాన్ని ఆసుపత్రులకు రెండు రకాలుగా చెల్లిస్తాయి. (1) బీమాచేసిన మొత్తాన్ని బీమాకంపెనీలు నేరుగా ఆసుపత్రులకు చెల్లించడం, (2) పాలసీదారుడు ముందు ఆసుపత్రికి చెల్లింపు చేసి, బీమాకంపెనీ వద్ద వాదన సమర్పిస్తాడు. అప్పుడు కంపెనీ అంగీకరించిన మొత్తాన్ని పాలసీదారునికి తిరిగి చెల్లిస్తుంది. ఆరోగ్య బీమాలో కొంతమంది శరీరంలోని వేరువేరు అంగాలకు వైద్యబీమా తీసుకుంటారు.

మనదేశంలో వ్యవసాయబీమా బీమావిభాగంలో ముఖ్యమైనది. మన ప్రజలలో దాదాపు 60% గ్రామాలలో నివసిస్తూ – అధిక సంఖ్యలో వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు; దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయం విచారకరంగా పూర్తి విపత్తులతో కూడియుండి – కరవులు, వరదలు, తుపానులు, ఉష్ణోగ్రతలలో మార్పులు, వడగండ్లు, ధరలఒడిదుడుకులు, క్రిమికీటకాలదాడులు, భూకంపాలు, అన్ని ప్రమాదాలు మొదలగునవి. ఏక ప్రమాద, బహు ప్రమాద కవరేజి వంటి రెండు బీమా పథకాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. – వ్యవసాయం పలురకాలైన విపత్తులు కలిగి యుండడాన్ని రైతులు చూస్తారు కావున, ఎక్కువగా రైతులు బహుప్రమాద కవరేజి బీమాపథకాలను ఎన్నుకోవడం మనం చూస్తాము. భారతప్రభుత్వం అధనంగా పలురకాలైన వ్యవసాయ బీమాపథకాలను రూపొందించింది. 1972లో H - 4 ప్రత్తి కోసం మొదటి వ్యక్తిగత సమీపము పథకం (ఫస్ట్ ఇన్‌డివ్యుజువల్ అప్రోచ్ స్కీమ్) (FIAS) ప్రారంభించింది. తర్వాత దీనిని వేరుశనగ, గోధుమ మరియు బంగాళా దుంపలకు వర్తింపజేశారు. 1979లో పైలట్ పంట బీమా పథకము (PCIS) ను ప్రాంత ఆధారంగా పంట తగ్గుదలకు బీమా కల్పించే విధంగా రూపొందించింది. ఇటీవల భారత ప్రభుత్వం పంట నష్టాన్ని, పంట నాశనాన్ని ఎదుర్కొంటున్న రైతుల ఆర్థిక సహాయ కోసం ప్రధానమంత్రి పంటల బీమా పథకం (PMFBY) రూపొందించింది. ఇది ఆహార పంటలు, నూనెగింజెలు మరియు వాణిజ్య / ఉద్యాన పంటలతో పాటు అన్ని పంటలను కవర్ చేస్తుంది. కౌలురైతులు మరియు పాలుదార్లతో పాటు రైతులందరు ఈ పథకం పరిధిలోనికి వస్తారు.

లక్షలాది మంది ప్రజలు ప్రధాన / సహాయక జీవనోపాధికి జీవరాశుల పెంపకం మీద ఆధారపడియున్నారు. ఎండు, పచ్చిగడ్డి కొరత, వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, పాలు మరియు మాంసం ధరలలో ఒడిదుడుకులు వంటి పెట్టుబడుల లేమితో ప్రజలు నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ బీమా పథకం ప్రధానఉద్దేశ్యం జీవరాశుల నష్టానికి గాను రైతులకు ఆర్థికసహాయం కల్పించడం. కేవలం 5% పశువులు మాత్రమే దేశంలో బీమా చేయబడినాయి. వ్యవసాయం మరియు వాటి అనుబంధ రంగాలకే కాకుండ – జీవన నిర్మాణం, కల్లుగీత, చేపలవేట, చేనేత మొదలగు పలు వృత్తులకు కూడా వివిధ బీమాపథకాలు ఉన్నాయి. చేనేత కార్మికులకు ప్రభుత్వం “మహాత్మగాంధి బంకర్ బీమా ప్రయోజన (MGBBY). బీమా పథకం ప్రారంభించి దీని క్రింద 18 – 59 సం॥రాల మధ్య వయస్సు గలిగి, 50% ఆదాయం చేనేత నుండి పొందుతున్న ప్రతి చేనేతకార్మికుడు అర్హుడే. మొత్తం ప్రీమియం రూ. 470/- లో పాలసీదారుడు రూ. 80/- సంవత్సరానికి చెల్లిస్తే, మిగతా ప్రీమియం మొత్తాన్ని కేంద్రప్రభుత్వం రూ. 290/- మరియు ఎల్ఐసి రూ. 100/- చెల్లిస్తుంది. పాలసీదారునికి మరణం / శాశ్వత అంగవైకల్యం సంభవించితే ఎల్ఐసి నామినీ / పాలసీ దారునికి రూ. 1,50,000/- చెల్లిస్తుంది. ప్రమాదం వలన పాక్షిక అంగవైకల్యం కల్గితే రూ. 75,000/- ఎల్ఐసి పాలసీ దారునికి చెల్లిస్తుంది. సహజ మరణం అయితే రూ. 60,000/- మరియు నెలకు రూ. 100/- ఉపకారవేతనంను 9 నుండి 12 గ్రేడులో చదివే లబ్దిదారుని పిల్లలకు అందిస్తుంది.

బీమారంగం, సహకారసంస్థలు, సమాఖ్యలు, స్వయం సహాయక బృందాల సమాఖ్యలు మొదలగు వాటిలో పారిశ్రామిక శిక్షణ సంస్థ (ITI) కోర్సులు కీలక పాత్ర పోషించగలవు. ఉదాహరణకు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) మరియు పట్టణ పేదరిక నిర్మూలన (MEPMA) పథకాలు SHG సమాఖ్యలు ఆమ్ఆద్మి బీమా యోజన AABY, అభయ హస్తం పింఛను AHPS మరియు గౌరవ అప్పు (లోన్ క్రెడిట్) వంటి బీమా పథకాలు అమలు  చేస్తున్నాయి.

ఆమ్‌ఆద్మీ బీమా యోజన AABY అనేది గిరిజన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో SERP మరియు MEPMA రాష్ట్రస్థాయిలో, SHG లు గ్రామీణ స్థాయిలో, జిల్లా సమాఖ్యలు జిల్లాస్థాయిలో పేద కుటుంబాలకు అమలు చేస్తున్న అత్యంత ముఖ్యమైన గ్రూపు బీమా పథకం AABYని కేంద్ర ప్రభుత్వం LIC భాగస్వామ్యంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 మార్చిలో ప్రారంభించింది. ఈ పథకం యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం మరణం / అంగవైకల్యం సంభవించిన కష్టకాలంలో పేద కుటుంబాలకు సహాయం అందించడం, లబ్ధిదారుల చదివే పిల్లలకు కూడా సహాయం అందించడం. AABY పలువృత్తులు చేసే ప్రజలకు వర్తించుతుంది. ఈ పథకం CBOల విధానం ద్వారా జయప్రదంగా అమలు చేయబడుతున్నది. రాష్ట్రస్థాయిలో SERP ఈ పథకాన్ని ప్రోత్సహించడం అజమాయిషీ, మరియు మూల్యాంఖనం చేయడంలో నోడల్‌ఏజెన్సీగా వ్యవహరిస్తున్నది. LIC బీమా వాదనలు మరియు చెల్లింపులు ప్రక్రియలు చూస్తుంది. క్షేత్రస్థాయిలో SHGలు, గ్రామ సంఘాలు (VOs) మరియు మండల మహిళా సమాఖ్యలు (MMS) AABY అమలులో పాల్గొంటాయి. బీమా వాదన 30 నుండి 36 రోజులు తీసుకుంటుంది. జిల్లా సమాఖ్యలు జిల్లా కేంద్రాలలో టోల్‌ఫ్రీ నెంబరుతో కాల్ సెంటర్ / (సహాయక కేంద్రం) ఏర్పరచాయి. ప్రతి పాలసీ బాండ్‌పేపర్ వెనకాల టోల్‌ఫ్రీ నెంబర్ ముద్రించింది.

జిల్లా స్థాయిలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు (DPM) AABY పథకాన్ని అజమాయిషీ చేస్తాడు. ఆమ్ ఆద్మీ బీమా యోజన(AABY) పేద ప్రజలు రూ. 320/- (రూ. 160/- రాష్ట్రం మరియు రూ. 160/- కేంద్రప్రభుత్వం) ప్రమాదంలో మరణం/శాశ్వత అంగవైకల్యం సంభవించితే నామినీ / పాలసీ దారునికి రూ.75,000/- చెల్లింపు; పాక్షిక అంగవైకల్యం కల్గితే పాలసీదారునికి రూ. 37,500/- చెల్లింపు; సహజమరణం విషయంలో నామినీకి రూ. 30,000/- చెల్లింపు. లబ్ధిదారుని ఇద్దరు పిల్లలకు 9 నుండి 12 గ్రేడు వరకు చదువుకోసం రూ. 100/- నెలకు ఉపకార వేతనం.

ఆమ్ ఆద్మీ బీమా యోజన AABY ను గ్రామస్థాయిలో ప్రోత్సహించి లబ్ధిదారులకు వాదనలు అందించడానికి జిల్లా సమాఖ్య ఒక SHG సభ్యున్ని బీమామిత్ర (BM)గా నియమించుతుంది. మరణం లేదా శాశ్వత అంగవైకల్యంను 24 గంటలలోపు బీమామిత్ర నమోదుచేసి గ్రామ సంఘం మౌఖిక ధృవీకరణ తీసుకుంటారు. కాల్‌సెంటర్ ఆపరేటర్ పాలసీదారుని పత్రాలను ప్రాథమిక పరిశీలన చేసి బీమామిత్రకు తెలియజేస్తే, బీమామిత్ర దగ్గరలోని ATM నుండి రూ. 5,000/- తీసుకుని గ్రామ సంఘం సభ్యునితో కలిసి వాహనదారు ఇంటికి వెళ్లి మరణానికి కారణాన్ని ధృవీకరించుకుని, పాలసీపత్రాలను పరిశీలించుతుంది. VO సభ్యుల సమక్షంలో పరిశీలన పూర్తి అయిన తర్వాత బీమామిత్ర రూ. 5,000/- లను నామినీకి అందిస్తారు. బీమామిత్ర వారం రోజులలోపు మరణధృవీకరణ పత్రం, ప్రమాదం జరిగితే ఎఫ్ఐఆర్, శవపరీక్ష / పంచనామా నివేదిక లేదా వైద్య నివేదిక (అంగవైకల్యం అయితే) సేకరించి MMS కార్యాలయం వద్ద పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. కాల్‌సెంటర్ ఆపరేటర్ వాటిని పరిశీలించి LIC కి పంపిస్తారు. LIC ఆపరేటర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని పరిశీలిస్తాడు. పరిశీలన తర్వాత LIC ఆపరేటర్ వోచర్ వివరాలను వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేస్తాడు. LIC అధికారి వాదన మొత్తాన్ని ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజిమెంటు సిస్టం (eFMS) ద్వారా నామినీకి అందించడానికి గాను SERP కు బదలాయించుతాడు.

SERP మరియు MEPMA లు అభయ హస్తం బీమా పథకాన్ని (AHPS) పేద ప్రజలకు నెలవారీ పింఛన్లు అందించడానికి అమలు చేస్తున్నాయి. SHG మహిళలు నెలకు రూ. 30/- మరియు ప్రభుత్వం రూ. 30/- నెలకు ప్రీమియం చెల్లించాలి. SHG మహిళ 60సం॥రాలు నిండడంతో నెలకు రూ. 500/- కనీస పింఛను పొందుతుంది.

విశాఖపట్నం జిల్లాలో జిల్లాసమాఖ్య యాజమాన్యంతో 'సంజీవని' ఆరోగ్యబీమా పథకాన్ని 5గురికి మించని గ్రామీణ పేద కుటుంబాలకు వైద్య సేవలందించడానికి నడుపుతున్నది. సంజీవని 2007 సంవత్సరంలో ప్రారంభించబడి 27 ప్రైవేటు ఆసుపత్రులు, 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs) కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాలు (CHCs), మరియు ఏరియా ఆసుపత్రుల (AHs) ద్వారా 75,000 పైగా పాలసీదారుల కుటుంబాలకు ఆరోగ్య సేవలందిస్తున్నది. మొత్తం 133 రోగాలను ఈ పథకం క్రింద కవర్ చేస్తున్నారు. పాలసీదారులు రూ. 310/- సంవత్సరానికి చెల్లించాలి. పాలసీదారులు శస్త్రచికిత్సలకు రూ. 35,000/- వరకు మరియు రూ. 5,000/- వైద్యసేవల కొరకు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పొందవచ్చును.

కొన్ని ప్రాంతాలలో సహకార సంఘాలు బీమా పథకాలను వివిధ పద్ధతులలో అమలు చేస్తున్నాయి. వీరు సామూహిక కొనుగోళ్లు, అమ్మకకేంద్రాలు నడుపుతూ వీటి ద్వారా వచ్చే లాభాలను బీమా ప్రీమియంల చెల్లింపులకు వాడుతున్నారు. సమాఖ్యలు, సహకార సంఘాలు జీవిత - సాధారణ భీమాలలో ముఖ్యపాత్ర పోషించగలవు - AABY దీనిని జయప్రదంగా నిరూపించింది. వేలకొద్ది ప్రజలు ఉన్నట్లయితే సహకార సంఘాలు LIC మరియు GIC వంటి బాహ్య సంస్థలు లేకుండానే స్వతంత్రంగా బీమాపథకాలను అమలు చేయవచ్చును.

బీమారంగంలో అనేక సమస్యలు మరియు సవాళ్లు ఉన్నాయి. గతంలో పోల్చి చూస్తే ఈ రంగంలో చాలా అభివృద్ధి ఉన్నప్పటికీ ఇప్పటికీ వివిధ బీమాఉత్పత్తుల గురించి ప్రజలకు పూర్తిగా అవగాహన లేదు. వ్యక్తిగత బీమాప్రీమియంలు గ్రూపుప్రీమియంల కంటే ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు ప్రమాదాల కోసం పెట్టుబడి పెట్టడంకంటే పొదుపుల ద్వారా వచ్చే ఆర్థిక లాభాల గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. Peerles మరియు సహారా బీమా వంటి ప్రైవేటు బీమాకంపెనీలు తమ అవకతవకలతో బీమా కంపెనీల యెడ వ్యతిరేక ప్రభావం కల్పించాయి. మెజారిటీ కార్మికులు అసంఘటితరంగంలో ఉంటూ వారికెటువంటి జీవిత మరియు ఆరోగ్య బీమా పథకాలు అందుబాటులో లేవు. అవగాహన కల్పించడానికి తగిన యంత్రాంగం కొరత, సాధారణబీమాలో వాదనలను ఆలస్యం లేకుండ పరిష్కరించడం వంటి సమస్యలను పరిష్కరించడం ద్వారా పాలసీదారుల సంఖ్యను పెంచుకోవచ్చు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసంధాన యంత్రాంగం, నెట్‌వర్క్, ప్రచారం ఏర్పాటు చేయడం ద్వారా అందరికీ బీమా కవరేజి అందించడానికి తమ పాత్రను పెంచాల్సియుంది. పైగా ప్రీమియం మొత్తం తగ్గించడం - ముఖ్యంగా వ్యక్తిగత బీమా పథకాలలో, వాదనల పరిష్కారాలను సకాలంలో చేయడం, ప్రైవేటు బీమాకంపెనీల మోసాలను అరికట్టడం, పరిశ్రమాధిపతులు తమ కార్మికులకు బీమా చెల్లించేలా ఆదేశించడం, సమాఖ్యలు మరియు సహకార సంఘాలు తమ సభ్యులకు బీమా పథకాలు అమలు చేయడాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు నిస్సహాయ ప్రజలకు చాలా సహాయ పడగలవు. మద్దతు సంఘాలు (SOs) కూడా CBO లు బీమాపథకాలు చేపట్టేలా ప్రోత్సహించాలి - ఇది పేదరిక నిర్మూలన సాధన దిశలో చాలా ముఖ్యమైన చొరవలలో ఒకటి. ✸

## ఆమ్ ఆద్మీ సంభాషణ

### ఉద్యోగ అవకాశం కోరుకుంటున్నాను...

**మీ గురించి మరియు మీ కుటుంబం గురించి చెప్పండి?**



నా పేరు ముందువరపు శ్రీనివాస్ మరియు నా వయస్సు 28 సంllలు. మాది ముందువరపు గ్రామం, అయినవెల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. నా యిద్దరు కొడుకులు, భార్యతో కలిసి నేను హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో నివాసం ఉంటున్నాను. నా పెద్ద కొడుకు 6వ తరగతి, చిన్న కొడుకు 4వ తరగతి చదువుతున్నారు. నా తండ్రి సోదరి కుటుంబంతో కలిసి మా గ్రామంలో ఉంటున్నారు. మా అమ్మ చనిపోయింది. మాకు స్వగ్రామంలో కొంత వ్యవసాయం ఉంది, దానిని గ్రామస్థునికి కౌలుకిచ్చాను.

**మీరు ప్రస్తుతం ఏమి చేస్తున్నారు?**

ప్రస్తుతం నేను 2015 నుండి హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ నెలకు రూ.6,000/- సంపాదిస్తున్నాను. నా భార్య కూడా అపార్ట్‌మెంటులోని ఇండ్లలో పని మనిషిగా చేస్తున్నది. మాకిచ్చిన ఒక గదిలో నివాసం ఉంటున్నాము. ఈ అపార్ట్‌మెంటులో 6 కుటుంబాలు ఉన్నాయి. నా రోజువారి పని ఉదయం 6గంllలకు మొదలై రాత్రి 11గంllలకు ముగుస్తుంది. నీటి తొట్టెలు నింపడం, మెట్లను, పార్కింగ్ స్థలాలను శుభ్రపరచడం, గ్రౌండుఫ్లోర్ నుండి రెండవ అంతస్తుకు ఇంటియజమానులకు మంచి నీరు సరఫరా చేయడం, నీటి తొట్టెలలో నీటి మట్టాలు పరిశీలించడం, అపార్టుమెంటుకు వచ్చే సందర్శకుల వరాలను అడగడం నా రోజు వారి విధులలో భాగం. దగ్గరలోని దుకాణానికి వెళ్లి ఇంటియజమానికి సరుకులు తెచ్చిపెడతాను. నా భార్య, కుమారులు కూడా నాకు పనిలో సహకరిస్తారు. నా కుటుంబ పోషణకు ఈ జీతం సరిపోతలేనందున క్యాబ్‌డ్రైవర్‌గా జీతం కోసం వెతుకుతున్నాను. నా భార్య నా బదులు కాపలాదారిణిగా చేయగల్గుతుంది.

**ఇంతకు ముందు మీరు ఏమి చేసారు?**

నేను రోజువారీ కూలీని – భవననిర్మాణ పనులు, రహదారి పనులు, వ్యవసాయ పనులు మొదలగునవి మా గ్రామంలో చేసేవాడిని.

**మీరు హైదరాబాదుకు ఎప్పుడు వచ్చారు?**

నేను 2006 లో హైదరాబాదుకు వచ్చాను, కాని అయిదు సంllరాల తర్వాత స్వంత గ్రామానికి వెళ్లాను. ఆ కాలంలో కూలీగా పని చేస్తూ కొత్తగూడ దగ్గర నివాసమున్నాను. హైదరాబాదుకు మరల రెండు సంవత్సరాల క్రితం పనికోసం వచ్చాను.

**మీ కేమైనా సమస్యలు ఉన్నాయా?**

అవును, ఆర్థిక సమస్యలున్నాయి. మా అమ్మ వైద్యం కోసం మా బంధువుల దగ్గర యాభైవేల రూపాయల అప్పు తెచ్చాను. అదృష్టవశాత్తు బంధువులు వడ్డీ అడగనందున, నేను అసలును మాత్రమే చెల్లించాల్సి ఉంది.

**ప్రభుత్వం నుండి మీరేమైన లబ్ధిపొందారా?**

అవును, నేను ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మరియు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) కార్డు పొందాను.

**మీ భవిష్యత్ లక్ష్యం ఏమిటి?**

నేను బడికి వెళ్లలేక పోయినందున నా పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని కోరుకుంటున్నాను. ✸

## నిస్సహాయుల సంభాషణ

### నా పిల్లల బాగు కోరుకుంటున్నాను...

**మీ పరిచయం చేస్తారా?**

నా పేరు నర్సమ్మ, భర్త యెల్లయ్య, నా వయస్సు 70 సంవత్సరాలు. నా భర్త 20 సంllరాల క్రితం చనిపోయాడు. నా స్వస్థలం పీపల్‌పహాడ్ గ్రామం, చౌటుప్పల్ మండలం, భువనగిరి జిల్లా, తెలంగాణ.

**మీ కుటుంబం గురించి తెలియజేస్తారా?**

నాకు ఇద్దరు కొడుకులు ఒక కూతురు. కొన్ని సంవత్సరాల క్రితం నా పెద్ద కొడుకు కూలీ పని చేయడం కొరకు ముంబయి వలసవెళ్లాడు. నా చిన్న కొడుకు హయాత్‌నగర్‌లో జీవిస్తున్నాడు. నా కూతురు హైదరాబాదులోని ఎల్.బి.నగర్‌లో ఉంటున్నది. నా పిల్లలందరూ బాగా స్థిరపడి వారి కుటుంబాలతో జీవిస్తున్నారు. ప్రస్తుతానికి నేను ఒంటరిగా జీవిస్తున్నాను. నా పెద్ద కొడుకు నెలకు రూ. 250/- పంపిస్తున్నాడు.

**మీరేమి చేస్తున్నారు?**

నేను దాయమ్మ లేదా మంత్రసాని పని చేస్తున్నాను. (గ్రామాలలో సాంప్రదాయ పద్ధతుల్లో కాన్పులు చేసే పెద్ద మహిళలను మంత్రసాని / దాయమ్మ అంటారు) కాన్పు ఒకటికి రూ. 500/- నేను వసూలు చేసేదాన్ని, కాని మంత్రసాని పని క్షీణిస్తున్నది. సంవత్సరానికి 2 నుండి 3 కాన్పులు చేసేదాన్ని 9 నెలల క్రితం నేను వృద్ధుల స్వయం సహాయక సంఘం (ESHG)లో చేరి, నెలకు రూ. 50/- పొదుపు చేస్తున్నాను. ESHG భావన మీద నేను శిక్షణ పొందాను. నేను వృద్ధుల సంఘం రిసోర్సు పర్సన్ (ECRP) గా కూడా పనిచేస్తున్నాను. వృద్ధులను ప్రోత్సహిస్తూ పీపల్‌పహాడ్, అల్లిపురం, దేవలమ్మనాగారం, లక్కారం, మరియు కడీలబావితండాలలో ESHG లను ఏర్పాటు చేయించాను. ECRP పనికి రోజుకు రూ. 250/- సంపాదిస్తున్నాను. ఈ పనిని నెల రోజులుగా చేస్తున్నాను. ఈ డబ్బుతో నా అవసరాలు తీర్చుకుంటున్నాను. ప్రభుత్వం నుండి నేను ప్రతినెల రూ. 1000/- వృద్ధాప్య పింఛను కూడా పొందుతున్నాను.

**మీరు ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు?**

నా ముసలితనంలో ఎవరూ నా గురించి పట్టించుకోవడం లేదు. నేను కీళ్లనొప్పులు, రక్తపోటుతో బాధపడుతున్నాను. నా పెద్ద కొడుకు నెలకు రూ. 250/- పంపుతున్నాడు, మరియు నా నెలవారి వృద్ధాప్య పింఛను డబ్బులతో మందులు కొంటున్నాను. కానీ ఈ మొత్తాలు నా మందుల కొనగోలుకు చాలడం లేదు. హెల్పేజ్ ఇండియా వారి సంచారవైద్య శిబిరం (MMU) నుండి మందులు తీసుకుంటున్నాను.

**ప్రభుత్వం నుండి మీరేమైనా లబ్ధిపొందారా?**

నేను రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, వృద్ధాప్య పింఛను, ఎన్నికల గుర్తింపు కార్డులు ప్రభుత్వం నుండి పొందాను

**మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?**

నా జీవిత చరమాంకంలో నాకు ఎలాంటి భవిష్యత్ ప్రణాళికలు లేవు. నా పిల్లలందరు బాగుండాలని కోరుతున్నాను. ✸

## గ్రామ ఔత్సాహిక వ్యాపారవేత్త సంభాషణ

### వృద్ధులు ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగాలి...

**మీ గురించి పరిచయం చేస్తారా?**



నా పేరు సాహు కమల్ శివాజీ పడల్వార్, నా వయస్సు 55 సం॥రాలు. నేను మహారాష్ట్ర లోని చంద్రాపూర్ జిల్లా, వరోరా బ్లాకు గోపాల్‌పూర్ గ్రామ వాసిని. నాకు ఇద్దరు కొడుకులు మరియు నా భర్త గ్రామంలో వ్యవసాయం చేస్తాడు. ఇద్దరు కొడుకులకు వివాహము అయ్యి కుటుంబాలతో స్థిరపడ్డారు. వారు గ్రామంలోనే వ్యవసాయం చేస్తున్నారు.

**మీరు ఏ గ్రూపులోనైనా సభ్యులా?**

అవును, నేను శారదా మాత మహిళా బచత్ గట్ కు కార్యదర్శిని. హెల్పేజ్ ఇండియా వారి అస్థిత్వ పథకంలో నవంబరు 2014లో ఏర్పడిన వృద్ధుల స్వయం సహాయక సంఘం మాది. మా సంఘంలో 2015, జూలైలో ప్రారంభమైన అంతర్గతఅప్పులు యివ్వడం జరుగుతుంది. సభ్యులుగా మేము జీవనోపాధుల కార్యక్రమాలకు మరియు ఇతర సంబంధిత పనుల కోసం అప్పులు తీసుకుంటాము. ఈ సందర్భంగా నేను గ్రామస్థాయి వ్యాపార సంస్థను ఏర్పాటు చేయడానికి సభ్యులనుండి అప్పు అడిగాను.

**ఎటువంటి వ్యాపారసంస్థను మీరు ఏర్పాటు చేశారు?**

నేను గ్రామంలో రూ. 25,000/- పెట్టుబడితో కిరాణా దుకాణం ఏర్పాటు చేశాను. దీనికి గాను రూ. 15000/- రుణం సంఘం నుండి తీసుకున్నాను. మిగతా డబ్బులు నా భర్త సమకూర్చాడు. ఇప్పుడు నా వ్యాపారసంస్థ బాగా నడుస్తున్నది. సంస్థ నిర్వహణలో నా కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారు. నేను దుకాణంలో అన్ని రకాల కిరాణా సరుకులు పెడతాను. బ్లాకు కేంద్రానికి వెళ్లి కిరాణా సరుకులను హోల్‌సేల్ ధరలకు తీసుకొస్తాను.

**మీరు అప్పును గ్రూపుకు ఎలా తిరిగి చెల్లిస్తారు?**

ప్రతినెల నేను వాయిదా పద్ధతిలో రూ. 2/- వడ్డీతో మా సంఘానికి అప్పును చెల్లిస్తున్నాను.

**ఈ షాపుని నడపడంలో మీరు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు?**

ఇప్పటి వరకు ఈ షాపులో నేను ఎటువంటి సమస్యను ఎదుర్కోలేదు. నా గ్రామంలో మా ESHG బృందం సభ్యులు మరియు ఇతర గ్రామాల సభ్యులు నా సంస్థకు సహకరిస్తున్నారు.

**ప్రభుత్వం నుండి మీరు ఏమైనా లబ్ది పొందారా?**

అవును, నేను రేషన్‌కార్డు, ఓటర్‌గుర్తింపు కార్డు, మరియు ఆధార్ కార్డు పొందాను.

**మీ భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి?**

నా వ్యాపార సంస్థను క్రమంగా విస్తరించడం నా యొక్క భవిష్యత్ ప్రణాళిక. దీనితో పాటు ESHGలో వృద్ధులను నాలాగా వ్యాపార సంస్థలను ప్రారంభించాలనే వారికి మద్దతు యివ్వాలనుకుంటున్నాను. హెల్పేజ్ ఇండియా అస్థిత్వ ప్రాజెక్టు క్రింద ESHG గ్రూపుల ఏర్పాటు సహకారం పొంది నేను వ్యాపారవేత్తగా కావడానికి పొందిన సహకారానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను. అస్థిత్వ ప్రాజెక్టుకు మరియు హెల్పేజ్ ఇండియాకు చాలా కృతజ్ఞతతో ఉన్నాను. ✷

## కమ్యూనిటీ లీడర్ సంభాషణ

### వృద్ధులకు సేవ చేయాలి...

**మిమ్ములను పరిచయం చేసుకుంటారా?**

నా పేరు మినప కేశవ్వ, నా వయస్సు 60 సం॥రాలు. నా స్వగ్రామం గూడూరు గ్రామం, ముస్తాబాదు మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నాకు ఇద్దరు కొడుకులు ఒక కూతురు. అందరికీ వివాహం జరిగి స్థిరపడ్డారు. నేను పెద్ద కొడుకు కుటుంబంతో కలిసి ఉంటున్నాను.

**మీరు ఏమి చేస్తున్నారు?**

2014 నుండి శ్రీకృష్ణ వృద్ధుల స్వయం సహాయక సంఘం (ESHG) రెండవ నాయకునిగా పని చేస్తున్నాను. ప్రస్తుతం మా గ్రూపులో 10 మంది సభ్యులున్నారు నెలకు రూ.100/- పొదుపు చేస్తాము. ఫిబ్రవరి 2016 నాటికి మా గ్రూపు మొత్తం పొదుపు రూ.18,500/-. మా సంఘం ముస్తాబాదు మండలంలో గల కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (KDCC)తో అనుసంధానం కల్గియుంది. నేను నాభూమిని లీజుకిచ్చి, అందులోనే వ్యవసాయ కూలి పనులు చేస్తున్నాను. పనులు లేని సమయంలో నేను MGNREGS క్రింద పనిచేస్తూ - ఇంటి పని కూడా చేసుకుంటాను.

ప్రతినెల మొదటి వారంలో మొదటి నాయకురాలి సహకారంతో ESHG నెలవారీ సమావేశాలు నిర్వహించడం నా బాధ్యత. మా సమావేశం ప్రార్థన మరియు పరిచయంతో మొదలై గతనెల పని సమీక్ష, పొదుపులు, అప్పుల పంపిణీ, చెల్లింపులు, డబ్బుల సేకరణ మరియు బ్యాంకులో జమ చేయడం గురించి చర్చలు ఉంటాయి. నేను మరియు మా గ్రూపు నాయకురాలు కలిసి ప్రతినెల గ్రామైక్య సమాఖ్య (VLF) సమావేశానికి హాజరవుతాము. VLF బ్యాంకు నుండి అప్పులు తీసుకొస్తుంది. మరియు హెల్పేజ్ ఇండియా నుండి నిధులు తీసుకొస్తుంది. VLF, ESHGలకు తక్కువ వడ్డీకి అప్పులు యిస్తుంది. ESHGలు వారి సభ్యులకు జీవనోపాధులను మెరుగుపరచుకొనుటకు విడతల వారీగా అంతర్గత అప్పులు ఇస్తాయి. మా సంఘంలో అప్పు చెల్లింపు క్రమబద్ధంగా ఉంది. మా సభ్యులు బ్రతుకమ్మ మరియు బోనాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగలు కలిసి నిర్వహిస్తారు. నేను, మా గ్రూపు నాయకురాలు ESHG మరియు దాని సభ్యురాళ్లకు జవాబుదారీగా ఉంటాము; మేము గ్రూపు సభ్యురాళ్లను అప్పులు, మరియు ఆరోగ్య సంబంధ సేవలు పొందడానికి ప్రోత్సహిస్తాము; వారు కుటుంబాలలో ఎదుర్కొనే సమస్యలను తట్టుకోవడానికి వృద్ధులకు నైతిక మద్దతు కల్పిస్తాము.

**మీరు ఏమైన శిక్షణ పొందారా?**

అవును, నేను మా గ్రామంలోని నవజ్యోతి సంస్థ ద్వారా ESHG భావన మీద శిక్షణ పొందాను. ఇది ESHG బలపరచడానికి నాకు సహాయపడింది.

**మీరు ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?**

మా ESHGకి సంబంధించినంత వరకు నాకు ఎటువంటి సమస్యలు లేవు. నా ముఖ్య సమస్యలు వృద్ధాప్యంలో క్షీణిస్తున్న ఆరోగ్యంతో కంటి చూపు తగ్గిపోవడం, కీళ్ల నొప్పులు.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్దిపొందారా?**

అవును నేను రేషన్ కార్డు, ఆధార్, ఎన్నికల గుర్తింపు మరియు MGNREGS ఉపాధి కార్డులను సంపాదించాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

ESHG సభ్యుల కుటుంబ సమస్యలు పరిష్కరించుతూ వారి హక్కులు, అర్హతల కోసం పోరాడుతూ వారు స్వయం సాధికారిత సంపాదించడానికి సహాయ పడాలని కోరుకుంటున్నాను. ✷

# అణగారిన సమూహాలను అభివృద్ధి చేయడం...



**మీ గురించి పరిచయం చేసుకుంటారా?**

నా పేరు అభిషేక్ కుమార్, నా వయస్సు 28 సం॥లు. నా స్వగ్రామం పూసా, సమస్తిపూర్ (బీహార్), నేను రాజేంద్రప్రసాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పూసా, సమస్థిపూర్ (బీహార్) నుండి వ్యాపార పద్ధతులలో వ్యవసాయం ప్రత్యేక అంశంగా ఎమ్‌బిఎ పూర్తి చేశాను; మరియు యాజమాన్యంతో యుజిసి NET పూర్తి చేశాను.

**మీరు ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్నారు?**

నేను 3 సంవత్సరాలుగా హెల్పేజ్ ఇండియా వారి జీవనోపాధులు, హక్కులు మరియు సాధికారత విభాగంలో ప్రాజెక్టు అధికారిగా (PO)గా పని చేస్తున్నాను.

**అభివృద్ధి రంగంలోనికి మీరు ఎలా వచ్చారు?**

హెల్పేజ్ ఇండియాలో శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకున్నాను. శిక్షణను జయప్రదంగా పూర్తి చేసుకున్న తర్వాత వారు కార్యక్రమ సహాయ విభాగంలో కార్యనిర్వహకునిగా పనిచేయడానికి అవకాశం కల్పించారు. తర్వాత నేను జిల్లా సమన్వయకర్త(DC)గా పనిచేశాను. DCగా చేరిన ఆరునెలల తర్వాత జీవనోపాధులు, హక్కులు మరియు సాధికారత విభాగానికి ప్రాజెక్టు అధికారిగా పదోన్నతి కల్పించారు.

**మీ సంస్థ మరియు మీ పని గురించి వివరంగా తెలియజేస్తారా?**

ప్రస్తుతము నేను బీహార్ మరియు ఝార్ఖండ్ రాష్ట్రాలలోని మూడు జిల్లాలలో అస్తిత్వ ప్రాజెక్టు పనులు చూస్తున్నాను. సుపాల్, ఔరంగబాద్ మరియు లోహార్‌దగ జిల్లాలలో నేను నా బృందంతో కలిసి ఇప్పటి వరకు 250 వృద్ధుల స్వయం సహాయక సంఘాలను (ESHG) ఏర్పాటు చేసి వాటికి జీవనోపాధుల సహాయక నిర్మాణాలను కల్పించాము. దీనితోపాటు ప్రాజెక్టుకు చెందిన గ్రామాలలోని వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలను పక్షానికొకసారి నిర్వహిస్తున్నాము. ESHGల ఏర్పాటు తర్వాత గ్రామ సమాఖ్యలను (VLF) మరియు మూడు బ్లాక్ స్థాయి సమాఖ్యలను ఏర్పాటు చేశాము. వృద్ధులను వారి హక్కులు మరియు అర్హతల కొరకు సమీకరించుతూ సమాఖ్యల ద్వారా వృద్ధాప్య పింఛన్లను కల్పిస్తున్నాము. బీహార్ మరియు ఝార్ఖండ్ రాష్ట్ర హెడ్ నా పనిని పర్యవేక్షిస్తాడు.

**మీ ఉద్యోగంలో మీ బాధ్యతలు మరియు పాత్ర గురించి వివరించుతారా?**

నా ఉద్యోగ బాధ్యతగా సమూహాల సమీకరణ, స్వచ్ఛంద సేవకులను గుర్తించడం, గ్రూపులను అభివృద్ధి చేయడం, పంచసూత్ర పైన శిక్షణ కల్పించడం, ఆఫీసు బేరర్లకు శిక్షణ కల్పించడం, రికార్డుల నిర్వహణ, ESHGలో తలెత్త గల వైరుధ్యాల మీద శిక్షణ, హక్కులు మరియు అర్హతలు, జీవనోపాధుల శిక్షణ, సూక్ష్మ పరపతి ప్రణాళిక (MCP), ప్రభుత్వ పథకాలలో సమన్వయం, బ్యాంకు మరియు క్రెడిట్ అనుబంధాలు, వృద్ధుల కమ్యూనిటీ రిసోర్సు వ్యక్తుల (ECRPs) గుర్తింపు; ECRPల సామర్థ పెంపు మరియు ప్రాజెక్టుల గురించిన మౌళిక జమాఖర్చుల నిర్వహణ చేపట్టడం.

**మీ విజయాలు మరియు అనుభవాలు ఏమిటి?**

నేను ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంలో ESHGలకు బ్యాంకు క్రెడిట్ అనుసంధానం కల్పించడం, ఈ గ్రూపులను ATMA (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ)తో విలీనం చేయడం, ఆత్ర పెద్దల ఉత్పాదక కంపెనీ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయడం, 82 వర్మికంపోస్టు యూనిట్లను సామూహికంగా ఒక పరిశ్రమగా నిర్మించడం నేను సాధించిన విజయాలు.

**సవాళ్లు మరియు సమస్యలు ఏమిటి?**

మైనారిటి కమ్యూనిటీ గ్రూపులను నడపడం మరియు సమాఖ్యలను బలోపేతం చేయడంలో నేను సవాళ్లను ఎదుర్కొంటున్నాను.

**మీరు సమస్యలను ఎలా అధిగమించారు?**

రాష్ట్ర హెడ్ మరియు సీనియర్ సహచరులు నాకు సమయానుకూలంగా సలహాలు ఇచ్చారు. వివిధ రకాలైన శిక్షణలు నిర్వహించారు. పలు వర్క్‌షాపులు మరియు స్పందన పర్యటనలు కార్యరంగంలో ఎదురయ్యే సమస్యలను సంభాళించి, అధిగమించడానికి తోడ్పడ్డాయి.

**మీ లక్ష్యం ఏమిటి?**

నేను వ్యవసాయ శాస్త్రవేత్తగా మారడం మరియు అణగారిన సమూహాలకు సహాయం చేయాలని కోరుకుంటున్నాను. ✸

సన్నకారు జీవనోపాధి

## రజక వృత్తిదారులు

ప్రతి గ్రామంలో "రజకులు" (చాకలి) / బట్టలుతికే వారు రోజువారీ జీవితంలో ఉంటారు. బట్టలు ఉతకడం మరియు ఇస్త్రీ చేయడం వీరి ప్రధాన జీవనోపాధి. తెలంగాణా రాష్ట్రం జోగులాంబ (గద్వాల) జిల్లా వడ్డేపల్లి మండలం పరిసరాలలో గల పైపాడు గ్రామంలో గల రజకులు తమ వృత్తి సానుకూలమైనది కాకపోవడంతో ఇతర జీవనోపాధులలోనికి మారారు. ఇంతకు ముందు చిన్న కాలువలు, ప్రవాహాలు ఉన్నందున రజకులు బట్టలు ఉతకడానికి వాటిపై ఆధారపడి జీవనం సాగించేవారు. కానీ కాలక్రమంలో కాలువలు, చిన్న నదులు ఎండిపోతున్నాయి మరియు "అభివృద్ధి" కార్యక్రమాలతో మరియు పారిశ్రామీకరణతో కాలుష్యం వలన వారికి పనికిరాకుండ పోతున్నాయి. అంతే కాకుండ సాంకేతిక అభివృద్ధితో వాషింగ్ యంత్రాలు మరియు ఇస్త్రీ పెట్టెలు దాదాపు ప్రతి కుటుంబం కొంటున్నారు. దీనితో చాలా రజక కుటుంబాలు పనిలేక అల్లాడుతున్నాయి. వారు బలవంతంగా తమ ప్రాథమిక వృత్తిని వదలుకొని ఇతర జీవనోపాధులలోనికి మారుతున్నారు. నేడు పైపాడ్ గ్రామంలో కేవలం 4 కుటుంబాలు మాత్రమే సాంప్రదాయ పద్ధతిలో సేవలందించుతున్నాయి. ఇంతకు ముందు రజకులు మొత్తం గ్రామంలోని కుటుంబాలను పంచుకుని వారానికొకటి రెండుసార్లు బట్టలు సేకరించి ఉతికి తిరిగి అదే రోజు యిచ్చేవారు. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ తక్కువగా వాడుకలో ఉన్నందున వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉండేది. బట్టలు ఉతికి, ఇస్త్రీ చేసినందుకు రజకులకు గృహస్థులు,వ్యవసాయ ఉత్పత్తులను యిచ్చేవారు. చాలా అరుదైన సందర్భాలలో వారికి డబ్బులు యిచ్చేవారు. అలా రజకులు వస్తుమార్పిడి సరుకులతో పాటు డబ్బులు కూడా తీసుకునేవారు. ప్రాథమిక జీవనోపాధి నుండి రెండవ జీవనోపాధులైన వ్యవసాయ భవననిర్మాణ కూలీ, ఉపాధి హామీ కూలీ వంటి పనులకు మారుతున్నారు. రెండవ తరం రజకులు విద్యా సౌకర్యాలు పొందుతూ మంచి ఉద్యోగాలు పొందుతున్నారు. ✸

ప్రామాణిక గ్రంథం

# ప్యాట్రన్ ఆఫ్ కల్చర్

**రచయిత : రుత్‌ఫుల్టన్ బెనెడిక్ట్.**




కొలంబియా విశ్వవిద్యాలయం మానవ పరిణామ శాస్త్రంలో (ఆంత్రోపాలజీ) ఆచార్యురాలు మరియు జానపథకులు శ్రీమతి రుత్ ఫుల్టన్ బెనెడిక్ట్ (1887-1948) 1936 లో వ్రాసిన "పాటర్న్స్ ఆఫ్ కల్చర్" మానవ పరిణామ శాస్త్రంలో ప్రారంభక రచన. నైఋతి అమెరికాలోని జునె ఇండియన్స్, వాయవ్య పసిఫిక్ లోని మరొక తెగ మరియు మైక్రోనేషియా యొక్క పసిఫిక్ ద్వీపాల ప్రజల మూడింటి వైవిధ్య సాంస్కృతిక అధ్యయనమే ఈ పుస్తకం. బెనెడిక్ట్ ఈ మూడు సమాజాలను పోల్చుతూ వాటిమధ్య ఉన్న వైవిధ్యాన్ని ప్రదర్శించుతుంది.

మూడు సంస్కృతుల వ్యక్తిత్వాలను, ఇవి ఎలా వివిధ లక్షణాలు కల్గియున్నాయనేది, లక్షణాలు, విలువలు, సాంప్రదాయాలు, నమ్మకాలు, ప్రతి సంస్కృతి ముఖ్యంగా భావించే వ్యక్తిగత ప్రాధాన్యాలు, మూడు సాంస్కృతుల మధ్య విబేధాల వలన వ్యక్తుల ఎలా స్వీకరిస్తారనేది రచయిత్రి చర్చించింది.

ఇతరుల సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే, ఒకరు దానిని పూర్తిగా అధ్యయనం చేయాలని బెనెడిక్ట్ చెపుతుంది. తమ స్వంత ఆచారాలను బట్టి ఇతరుల సంస్కృతిని అంచనా వేయవద్దని, ఎందుకంటే వారి ఆచారాలు ఇతర సంస్కృతి వారితో సరిపోలవని ఆమె చెపుతుంది. నువ్వు విలువయివ్వాలని నమ్ముతున్న అంశాలపై పక్షపాత వైఖరి ఉంటే అది ఇతర సంస్కృతుల నమ్మకాలపై వ్యతిరేక ప్రభావం కల్గడానికి దారితీస్తుందని బెనెడిక్ట్ చెపుతుంది.

ఈ పుస్తకం మూడు కేంద్ర నేపథ్యాలు కలిగి యుంది :- (1) మానవ సంస్కృతి ప్రధానంగా వ్యక్తిత్వం - ప్రాధాన్యత కలదిగా చూడబడుతుంది. (2) వివిధ సంస్కృతుల తులనాత్మక అధ్యయనం మన స్వంత సాంఘిక మరియు సాంస్కృతిక ప్రవర్తనల మీద వెలుగు ప్రసరించుతుంది. మరియు (3) నైతికత అనేది ఆధారపడిన సాంస్కృతిక అంశం మరియు సాంస్కృతిక విబేధాలను సంపూర్ణ ప్రమాణాలతో పోల్చిచూడకూడదు.

ఇతర సంస్కృతిని అర్థం చేసుకోగలిగితే అంతిమంగా ఆ సంస్కృతి యొక్క సామరస్యతకు దారి తీస్తుందని రుత్ బెనెడిక్ట్ సాక్ష్యాలు చూపించింది. ఈ అవగాహన ఇతర సంస్కృతుల యెడ గల అచ్చొచ్చిన అభిప్రాయాలను లేదా జాతి వ్యతిరేకతను తొలగించడంలో కీలకమైనది.

మానవాళి వ్యక్తులు లేదా సమూహాలుగా వారి జీవితాల యొక్క అర్థాలను మరియు ఆచరణలను ఎలా రూపొందించు కుంటారనే దానికి రుత్ బెనెడిక్ట్ చాలా అద్భుతమైన ఆలోచనలను మరియు ఉదాహరణలు చూపించారు. వ్యక్తిగత మరియు సామాజిక ప్రపంచం ఒకే నాణానికి రెండు వైపులు లాంటివని, కొనసాగుతున్న గతి శీలనంలో ఒకటి మరొకదానిని రూపొందించుతుందని బెనెడిక్ట్ చూపించారు. సంస్కృతి మరియు తమ గురించి ఆసక్తి యున్న ఎవరికైనా ఈ పుస్తకము సిఫార్సు చేయబడింది. ఈ పుస్తకం మానవాభివృద్ధి శాస్త్రంలో మరియు మానవ అధ్యయనాలలో పరిశోధకులకు ముఖ్యమైనది. ✷

## లేటెస్ట్ పుస్తకాలు



**పుస్తకం పేరు:** సెక్యూరింగ్ లైవ్‌లీహుడ్స్: ఇనఫార్మల్ ఎకానమీ ప్రాక్టీసెస్ అండ్ ఇన్‌స్టిట్యూషన్స్.
**సంపాదకులు:** ఇసబెల్లె హిల్లెన్ కాంప్, ఫ్రిడరిక్ లేపెరె మరియు ఆండ్రియాలెమాట్రే
**పబ్లిషర్:** ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటి ప్రెస్.



**పుస్తకం పేరు:** ది గాంగెస్ రివర్ బేసిన్; స్టేటస్ అండ్ ఛాలెంజెస్ ఇన్ వాటర్, ఎన్విరాన్ మెంట్ అండ్ లైవలీ హుడ్స్.
**సంపాదకులు:** లూనా భారతి భరత్, ఆర్. శర్మ, వ్లాదిమిర్‌స్మఖ్తిన్
**ముద్రాపకులు:** రూట్‌లెడ్జ్.

జీవన తంత్రం

# శీలా మరియు కొండ చిలువ

ఒకానొకప్పుడు శీలా అనే పేరుగల మహిళ కొండ చిలువను పెంపుడు జంతువుగా కలిగి యుండినది. శీలా తన కొండచిలువతో చాలా సన్నిహితంగా ఉండెడిది. ఆమె దానికి తిండి పెడుతూ, ఆడుకుంటూ రోజు పెనవేసుకుని పడుకొనేది.

కొద్ది వారాల తర్వాత కొండచిలువ తినడం మానివేసింది. కొండ చిలువకు తిండి పెట్టడానికి అనేక విఫల ప్రయత్నాలు చేసిన తర్వాత ఆమె పశు వైద్యుని దగ్గరికి తీసుకెళ్లింది. వైద్యుడు కొండచిలువను పరీక్షించాడు.

డాక్టర్ : "నీవు కొండచిలువతో కలిసి పడుకుంటావా?" శీలా అవునని తలాడించింది.

శీలా : "అవును, అది నా శరీరాన్ని పూర్తిగా చుట్టుకుని ఉంటుంది"

వైద్యుడు కొద్దిసేపు ఆగి ఇలా చెప్పాడు "మేడమ్, మీ కొండచిలువ జబ్బుతో లేదు. అది నిన్ను తినడానికి ప్రయత్నిస్తున్నది. మిమ్ములను పెనవేసుకున్నపుడు అది మీ బరువును మరియు సైజును కొలుస్తున్నది. మరియు మిమ్ములను ఎలా చంపాలో, ఎలా ఆరగించుకోవాలో పథకం వేస్తున్నది". వైద్యుడు మాట్లాడుతూ,

"మింగడానికి మరియు ఆరగించుకోవడానికి మానవులు చాలా పెద్దగా ఉన్నందున, మీ కొండచిలువ మిమ్ములను ఆరగించు కోవాలని ఎటువంటి ఆహారం తీసుకోవడం లేదని" చెప్పాడు.

దీనికి శీలా నిరుత్సాహపడి వైద్యుడు చెప్పేదాన్ని తిరస్కరిస్తూ తన యింటికి వెళ్లింది. ఆ రాత్రి కొండచిలువ శీలాపై దాడి చేసి మింగేసింది.

**నీతి : మీతో సన్నిహితంగా ఉన్న ప్రతి ఒక్కరు, నిజంగా మిమ్ములను ప్రేమించరు. మీరు మీ తప్పులను ఖండించుతూ తీరిక లేకుండ ఉండనట్లయితే మీరు తప్పుల నుండి గొప్ప విషయాలు నేర్చుకోగలరు.** ✷

ఎలా

# సమాఖ్యను రిజిష్టర్ చేయడం

**ఒక సమాఖ్య లేదా గ్రామస్థాయి సంస్థ (VLS) గ్రూపులోని వ్యక్తుల స్వతంత్ర సంస్థ. సమాఖ్యగా ఏర్పడడం ద్వారా తమ అవసరాలను తీర్చుకోవడానికి వారు ఐక్యమవుతారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు ఆకాంక్షల అవసరాలు – ఉమ్మడి యాజమాన్యంగల ప్రజాతంత్రయుతంగా నియంత్రించే సమాఖ్య/VLS ద్వారా తీర్చుకోగలరు. సమాఖ్యలు ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ, సహకార సంఘాల చట్టం (APMACS), 1995 ద్వారా నమోదు చేయబడతాయి.**




భారతదేశంలో స్వయం సహాయక సంఘాల (SHG) ఉద్యమం పేదరిక నిర్మూలనలో గొప్ప సంభావ్యతను సృష్టించింది. జనాభాలోని అట్టడుగు వర్గాలకు ముఖ్యంగా దేశంలోని మహిళలకు ఈ ఉద్యమం సాధికారత కల్పించింది మరియు సాధికారత కల్పన కొనసాగుతూ ఉంది. మహిళా స్వయం సహాయక సంఘాల నమూనా బంగ్లాదేశ్‌లోని గ్రామీణ బ్యాంకు నమూనా నుండి రూపొందింది. – భారతదేశంలో కూడా విజయాలు సాధించింది. వారితో పాటు రైతులసమూహాలు, కమ్యూనిటీవారీ గ్రూపులు కూడా మనదేశంలో ఏర్పడ్డాయి. ఒక సమాఖ్య లేదా గ్రామస్థాయి సంస్థ (VLS) గ్రూపులోని వ్యక్తుల స్వతంత్రసంస్థ. సమాఖ్యగా ఏర్పడడం ద్వారా తమ అవసరాలను తీర్చుకోవడానికి వారు ఐక్యమౌతారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు ఆకాంక్షల అవసరాలు – ఉమ్మడి యాజమాన్యం గల ప్రజాతంత్రయుతంగా నియంత్రించే సమాఖ్య / VLS ద్వారా తీర్చుకోగలరు. సమాఖ్యలు ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ, సహకార సంఘాల చట్టం (APMACS) 1995 ద్వారా నమోదు చేయబడతాయి.

**సమాఖ్య/VLS విలువలు:** ఒక సమాఖ్య/VLS స్వయంసహాయం, స్వయంబాధ్యత, ప్రజాస్వామ్యం, సమానత్వం, ధర్మము మరియు సంఘీభావం వంటి విలువలమీద ఆధారపడింది. సమాఖ్యలో ఆఫీసు బేరర్లు మరియు సభ్యులు నిజాయితీ, నిర్మోహమాటం, సామాజికబాధ్యత మరియు ఇతరుల క్షేమం కోరడం వంటి నైతికవిలువలపై నమ్మకంగలవారు.

**సమాఖ్యVLS సూత్రాలు:** సమాఖ్య/VLS ఏడు సూత్రాలు కలిగి యున్నాయి. ఇవి తమ విలువలను ఆచరణలో పెట్టడానికి మార్గదర్శకాలు. అవి క్రింది విధంగా ఉన్నాయి. (1) స్వచ్ఛంద మరియు బహిరంగ సభ్యత్వం; (2) సభ్యుల ప్రజాస్వామ్య నియంత్రణ; (3) సభ్యుల ఆర్థికభాగస్వామ్యం; (4) స్వతంత్రత మరియు స్వాతంత్ర్యము; (5) విద్య, శిక్షణ మరియు సమాచారం; (6) సమాఖ్య/VLS ల మధ్య సహకారం; మరియు (6) సమూహం కోసం తపన.

**సమాఖ్య/VLSను ఎందుకు నమోదు చేయాలి?**

సమాఖ్యల ఏర్పాటు ద్వారా ఆర్థిక వ్యవస్థలు ఉనికిలో ఉండి, లావాదేవీల ఖర్చులు మరియు ఉనికిలో వున్న రేట్లు తగ్గాలి. సూక్ష్మబీమా మరియు పెట్టుబడుల సరఫరా వంటి విలువఆధారిత సేవలు కల్పించబడాలి; ప్రచార ఖర్చులు తగ్గిస్తూ సేవలపరిధిని పెంచాలి. SHGలు సాధించిన సాధికారతను పెంచుతూ సమాఖ్యలు నాయకులను తయారు చేస్తూ, సౌకర్యాలను పెంచుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన స్రవంతి సంఘాలు ఉన్నతస్థాయి అధికార యంత్రాంగంతో వ్యవహరించేలా చేస్తాయి. SHGలు నిలదొక్కుకుంటూ మరియు ఉత్సాహభరితంగా పని చేస్తూ, మహిళల సామాజిక మరియు ఆర్థిక సాధికారత తీసుకురావడానికి సమాఖ్యలు తోడ్పడతాయి. ప్రస్తుత SHGలను బలోపేతంచేయడానికి SHG సమాఖ్యలను ప్రోత్సహించుతున్నారు. మరియు ఇవి పేదల కొత్త SHG లను నెలకొల్పుతూ SHG సభ్యులకు పలు సేవలలభ్యతను పెంచుతుంది. SHG ల సామర్థ్య నిర్మాణంలో సమాఖ్యలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అంతకంటే ఎక్కువగా ఒకే ప్రాంతంలో ఉన్న SHGల సభ్యుల మధ్య సంఘీభావన కల్పిస్తాయి. SHG లు సాధారణంగా స్వరితంగా ఏర్పడిన సంఘాలు కానందున వీటిలో స్వంతం అనే భావం కల్పించడం చాలా ముఖ్యం.

**సమాఖ్యల నమోదుకు పద్ధతులు:**

• ప్రతి SHG నుండి ఒక ప్రతినిధి CBO / VLS ఏర్పాటుకు ముందుకు రావాలి.

• ప్రతినిధి సభ్యుడు సమాఖ్య / VLS యొక్క లక్ష్యాలను మరియు ఇతర విషయాలను చర్చించాలి.

• నూతనంగా ఏర్పడిన తాత్కాలిక సమాఖ్యలోని ఇద్దరు లేదా ముగ్గురు ప్రతినిధులు జిల్లా సహకార నమోదు కార్యాలయం (DCRO) నకు సమాఖ్య నమోదు కోసం వెళ్లాలి.

• బై-లాల దరఖాస్తు పత్రం నింపి రిజిస్ట్రార్ కార్యాలయంలో సంబంధిత అధికారికి యివ్వడం వంటి అన్ని పనులను పూర్తి చేయాలి.

• సమాఖ్య ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ, సహకార సంఘాల చట్టం 1995 ద్వారా అధికారికంగా నమోదు జరిగింది.

**సమాఖ్య నమోదుకు కావలసిన పత్రాలు:**

• సంస్థ మెమోరాండం (MOA), నియమాలు మరియు నిబంధనలు (RR). ఈ రెండు పత్రాలను చేతి వ్రాతతో / ముద్రించి / తెల్లకాగితాల మీద టైపు చేసి యివ్వాలి.

• సమాఖ్యను ఏర్పరచుటకు కనీసంగా అయిదుగురు నుండి 9 మంది అవసరం. సభ్యుల గరిష్ట సంఖ్య గురించిన పరిమితి ఉంది.

• ఈ సభ్యులకు వివిధ పదవులు ఉంటాయి - వాటిని వారు నిర్ణయించుకోవాలి.

• సాధారణ పదవులు : అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి మరియు కోశాధికారి మొదలగునవి.

• ఈ సభ్యులందరిని సమిష్టిగా పాలక మండలి (ఆఫీస్ బేరర్లు) అంటారు. ఈ మండలి సమాఖ్య పనివిధానాన్ని నిర్దేశించుతూ నియంత్రిచుతుంది

• VLS సభ్యులందరూ పరిమిత కాలానికి ఎన్నుకోబడుతారు (కాల పరిమితిని MOA లో సూచించాలి.) కాల పరిమితి తీరిపోయిన తర్వాత, ఆ పదవిని ఎన్నికల ద్వారా పూరించాలి. ఈ ఎన్నికలలో పాలక మండలి సభ్యులు పాలుపంచుకుంటారు.

• ఎన్నికల విధానం అమలులో ఉన్నందున సమాఖ్యలు VLS మరియు Trust ల కంటె ఎక్కువ ప్రజాస్వామ్య యుతంగా ఉంటాయి. అదే సమయంలో పదవుల కోసం పోరాటం, రాజకీయాలు చొరబడే అవకాశం ఉంది - ఇవి ప్రతికూలతలు. ఎన్నికల రాజకీయం ద్వారా సమాఖ్య ఏర్పడితే - మొదటగా VLS కు చొరవ చూపిన వ్యక్తిని కూడా తొలగించడానికి అవకాశం ఉంటుంది.

• ట్రస్టులు, సొసైటీలకు భిన్నంగా సమాఖ్యలు ఒక ప్రత్యేకమైన భూభాగం ప్రాంతానికి పరిమితమై పనిచేస్తాయి.

**సంస్థ మెమోరాండంలో (MOA) తప్పని సరిగా ఉండాల్సినవి:**

1. సమాఖ్య పేరు
2. సమాఖ్య / VLS లక్ష్యాలు
3. నమోదిత కార్యాలయం (RO) చిరునామా
4. మొదటి పాలకమండలి సభ్యుల పేర్లు, హోదాలు, చిరునామాలు మరియు వృత్తులు

**నమోదు దరఖాస్తు:**

• సమాఖ్య / VLS నమోదు చేసే వివిధ కుటుంబాలకు చెందిన 10 మంది సభ్యులు వెళ్లి నిర్దేశించిన ఫారంలో దరఖాస్తు చేయాలి. దీనితో ప్రమోటర్ల సమావేశం మినిట్స్ ప్రతిపాదించిన బైలాల అసలు ప్రతి మరియు నకలు ప్రతి.

• ప్రతి దరఖాస్తుదారుని ప్రమాణస్వీకార ప్రకటన.

**సమాఖ్య / VLS నమోదు పద్ధతి:**

1. గ్రామస్థాయి సంఘం (VLS) / సమాఖ్యను ఏర్పాటు చేయదలచిన 10 మంది సభ్యులను సమీకరించడం మొదటి దశ.

2. తాత్కాలిక కమిటిని ఏర్పాటు చేసి వారి నుండి ముఖ్య ప్రమోటర్‌ను ఎన్నుకోవాలి.

3. సమాఖ్య / VLS కు ఒక పేరు నిర్ణయించుకోవడం.

4. పేరు నమోదు కోసం నమోదు అధికారికి ఒక దరఖాస్తు సమర్పించి, సమాఖ్య పేరు నమోదును సూచించే ధృవీకరణపత్రాన్ని అతని నుండి తీసుకోవాలి. ఒకసారి ప్రత్యేకించుకున్న పేరు 3 నెలల వరకు చెల్లుతుంది.

5. మొదటగా బైలా (నియమావళి)ని లక్ష్యాలు మరియు పాలక మండలి సభ్యుల పేర్లు. చిరునామా ధృవీకరణ ఫోటోలు జతపరచి పూరించాలి. సమాఖ్య లక్ష్యాలు దాని రకాన్ని బట్టి ఉంటాయి. ఒక వేళ SHG సమాఖ్య అయితే ఆర్థిక మరియు సాంఘీక కార్యక్రమాలు లక్ష్యాలలో ఉండాలి.

ఒకవేళ ధార్మిక ట్రస్టు అయితే దానికి సంబంధించిన లక్ష్యాలు ఉంటాయి. ప్రభుత్వ సమాఖ్య లక్ష్యాలు ప్రభుత్వ కార్యక్రమాలు మీద ఆధారపడి ఉంటాయి. మరియు NGO లేదా CSO అయితే వాటికి సంబంధించిన రంగాలలోని లక్ష్యాలు ఉంటాయి.

6. ప్రవేశ రుసుం మరియు వాటా ధనం సంబంధిత సభ్యుల నుండి వసూలు చేయాలి. సభ్యుల నిర్ణయం మరియు స్తోమత ఆధారంగా ఇది రూ. 100/- నుండి రూ. 1000/- నెలకు ఉంటుంది. మరియు సభ్యత్వ రుసుం కూడా సభ్యుల నిర్ణయం మీద ఆధారపడి రూ.

50/- నుండి రూ. 100/- వరకు ఉంటుంది.

7. నమోదు అధికారి ఆదేశాల ప్రకారం ప్రతిపాదించిన సమాఖ్య / VLS పేరుతో బ్యాంకు ఖాతా తెరవాలి. ప్రవేశ రుసుం మరియు వాటా ధనం బ్యాంకుఖాతాలో జమచేసి - తగిన ధృవీకరణపత్రాన్ని బ్యాంకు, తగిన రసీదు చాలానును పొందాలి.

8. నమోదు రుసుమును భారతీయ రిజర్వ్ బ్యాంకులో జమ చేసి - దానికి తగిన రశీదు ఛలానును పొందాలి.

9. సమాఖ్య / VLS నమోదుకోసం దరఖాస్తును తత్సంబంధిత మున్సిపల్ వార్డులోని సంఘాల రిజిస్ట్రారుకు అందించాలి. నమోదు కోసం సమర్పించవలసిన పత్రాలు క్రింది విధంగా ఉన్నాయి.

(a) 90% ప్రతిపాదించిన సభ్యులు సంతకాలు చేసి ఫారం నెం. A నాలుగు ప్రతులు

(b) ప్రతిపాదనచేస్తున్న సభ్యుల జాబితా

(c) బ్యాంకు సర్టిఫికెట్

(d) సమాఖ్య / VLS యొక్క పనివిధానం గురించిన వివరమైన వర్ణన

(e) సమాఖ్య VLS యొక్క ప్రతిపాదించిన బై-లా (నియమావళి) 4 ప్రతులు.

(f) నమోదు రుసుము చెల్లించిన దాఖలా

(g) అఫిడవిట్లు, హామీ పత్రాలు (Indemnity Bonds) మరియు రిజిస్ట్రార్ సూచించిన ఇతర పత్రాలు సమర్పించాలి.

10. రిజిస్ట్రారు వివరాలన్నింటిని Form “B” లో నిర్వహించుతున్న దరఖాస్తుల రిజిస్టర్‌లో నమోదు చేసి క్రమసంఖ్యను కేటాయించి - వీటిని అంగీకరిస్తూ రసీదును యిస్తాడు.

**సమాఖ్యకు కావాల్సినవి:**

- దరఖాస్తు ఖరీదు రూ. 1000/-
- నియమావళి (బై-లా) - సమాఖ్య లక్ష్యాలు (సమాఖ్య ఎవరిదగ్గరికి వెళ్లాలనుకుంటుంది, ఎటువంటి సేవలు అందిస్తుంది, ఏకీకృతం మరియు ఇతర అంశాలు).
- ప్రతిపాదిత సమాఖ్య నియమావళి (బై-లా) యొక్క అసలు ప్రతి - ప్రతిపాదిత సొసైటి సభ్యులు పాలకమండలి ఆమోదించినవి (MACS చట్టం క్రింద ఉనికిలో ఉన్న సొసైటి.)
- ప్రతిపాదిత సభ్యుల పేర్లు, చిరునామాలు, వృత్తులు మరియు ఆర్థిక నిబద్ధత
- నియమావళిని ఆమోదిస్తున్న సభ్యుల సంతకాలతో కూడిన మినిట్స్ నకలు ప్రతి మరియు మార్పునకు అంగీకరించిన సమావేశం మినిట్స్ ఏది అవసరం అయితే అది.
- సమాఖ్య వాటాధనం వివరాలు - (ఒక్కొక్క SHG ఎంత మొత్తాన్ని సమాఖ్యలో వాటాధనంగా పెడుతున్నాయి మరియు వాటాధనంకు అవసరమైన వివరాలు.)
- సమాఖ్య యొక్క ఎన్నికైన డైరెక్టర్ల బోర్డు సభ్యులు. రిజిస్ట్రార్ డైరెక్టర్ల వివరాలు, చిరునామా ధృవీకరణ (ఆధార్ కార్డు) మరియు మూడు సంవత్సరాల కాల పరిమితి రిజిస్ట్రార్ అడగాలి.
- ఆఫీస్ బేరర్లు (OB) గా ఏకగ్రీవంగా సర్వసమ్మతంతో (చేతులెత్తడంద్వారా) ఎన్నుకోబడడం.
- సంబంధిత వ్యక్తులు (ఒకే కుటుంబానికి చెందిన వారు) పాలకమండలిలో సభ్యులుగా ఉండడానికి వీలులేదు.
- పాలకమండలి సభ్యులు సమాఖ్య నిధుల నుండి ఎటువంటి వేతనం తీసుకోరాదు.
- పాలకమండలి సభ్యులు విధులు నిర్వహించే క్రమంలో అయిన ఖర్చులను సమాఖ్య నిధుల నుండి తిరిగి పొందవచ్చును.

**సమాఖ్య / VLS యొక్క నియమ నిబంధనలు :**

- ప్రతి ఒక SHG నుండి ఒక సభ్యుడు సమాఖ్యకు నామినేట్ అయ్యేలా చూడడం.
- సభ్యులు సమాఖ్య యొక్క డైరెక్టర్లుగా కావాలి.
- సమాఖ్య సమావేశాలు నెలకొకసారి జరిగేలా చూడడం
- సాధారణ సమావేశం (GBM) సమావేశాలు 6 నెలలు లేదా సంవత్సరానికి ఒకసారి జరిగేలా చూడడం.
- సాధారణ సమావేశం (GBM) లో సమాఖ్య అంశాలు మరియు లావాదేవీలకు సంబంధించిన పనుల గురించి ఆమోదం తీసుకునేలా చూడడం.
- ప్రతి సమాఖ్య - గుర్తింపు పొందిన బ్యాంకుతో అనుసంధానం ఏర్పరచుకుని లావాదేవీలు క్రమం తప్పకుండా బ్యాంకు ద్వారానే నిర్వహించాలి.
- సమాఖ్య డైరెక్టర్లు సమావేశం ప్రతినెల నిర్దేశించిన తేదీలో నిర్వహించేలా చూడడం.

• ఈ సమావేశంలో డైరెక్టర్లందరూ మరియు పాలకమండలి సభ్యులు సమాఖ్య కార్యక్రమాలు, పొదుపులు, చెల్లింపులు మరియు ఇతర లావాదేవీల గురించి చర్చించేలా చూడడం.

**బై-లాలు / నియమావళి యొక్క పరిధి :**

• సమాఖ్య / VLS యొక్క బై-లాలో ఈ క్రింది అంశాలు ప్రత్యేకంగా ఉండేలా చూడాలి.

• సమాఖ్య VLS యొక్క లక్ష్యాలు మరియు సభ్యులందరికి కల్పించే సేవలు.

• సభ్యుల అర్హతలు, అనర్హతలు మరియు ఎన్నికలలో ఓటు వేయడానికి అర్హతలు.

• సభ్యుల నుండి ఆశించే కనీసపనితనము.

• తప్పు జరిగితే ఎదురయ్యే పరిణామాలు.

• సాధారణ సభ (GBM) అధికారాలు మరియు విధులు

• బోర్డు మరియు అధ్యక్షుడు మరియు జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించే పద్ధతి మరియు కాలపరిమితి.

• బోర్డు సమావేశాలు మరియు డైరెక్టర్ల పదవీకాలానికి అవసరమైన కోరం మరియు డైరెక్టర్లబోర్డు సంఖ్య, పొందిక, అర్హత మరియు అనర్హతలు.

• ఎన్నికలు నిర్వహించే విధానం మరియు తాత్కాలిక ఖాళీలను పూర్తిచేయడం, సమాఖ్య ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తే జరిమానాలు.

• విధులు సక్రమంగా నిర్వహించకపోవడం, మరియు అప్పుల ఒప్పందం, అధీకృత సంతకందారుని నియమించడంలో ఆఫీసు బేరర్ల / డైరెక్టర్ల బాధ్యత స్వభావం, పరిమాణం.

• ప్రతినిధులను ఎంచుకునే విధానం, పెట్టుబడి మొత్తం మరియు స్వభావం, ప్రతిసభ్యుడు ఉంచుకోగల అత్యధిక పెట్టుబడి, వాటా ధనం మీద సభ్యులకు చెల్లించగల ఎక్కువ వడ్డీ, నిధులు / వనరుల పెంపు మరియు వాటి వినియోగం.

• రద్దుపరచు విధానం మొదలగునవి.

**నమోదు దరఖాస్తుపై చర్య:**

• సమాఖ్య / VLS యొక్క నమోదుకార్యక్రమం ఒకవేళ ప్రాథమిక సొసైటి అయితే 45 రోజులు తీసుకుంటుంది. ఇతర సొసైటీలైతే దరఖాస్తు చేసుకున్న నాటి నుండి 60 రోజులలో జరుగుతుంది.

• రిజిస్ట్రార్ సమాఖ్య యొక్క బై - లాలను మరియు ఇతర వివరాలను తనిఖీ చేసి, పరిశీలన జరిపిన తర్వాత సమాఖ్య నమోదు పత్రాన్ని అంద జేస్తాడు. (RC)

• ఒకవేళ రిజిస్ట్రార్ సంతృప్తి చెందకపోతే, అతడు / ఆమె తిరస్కరణ ఆదేశాన్ని అంతే సమయంలో తెలియజేస్తాడు.

• సమాఖ్య / VLS నమోదు అయిన వెంటనే కార్పోరేట్‌బాడీలో భాగం అవుతుంది.

**బై-లాలకు సవరణలు :**

సమాఖ్య / VLS కు సంబంధించిన బై-లాలను సమాఖ్య / VLS అవసరాల కోసం గాని, రిజిస్ట్రార్ యొక్క సలహా ప్రకారం గాని లేదా రిజిస్ట్రార్ గాని మార్పులు చేయవచ్చును. నమోదు అయిన బై-లాలకు సవరణలు చేపట్టడానికి పేరులో మార్పుగాని, బాధ్యతల మార్పు మొ॥నవి, వీటిని జనరల్ బాడీ 2/3 కు తక్కువ కాని మెజారిటి (హాజరైన సభ్యుల) తో ఈ సవరణలను ఓటింగు ద్వారా ఆమోదించి, రిజిస్ట్రార్ ద్వారా 30 రోజులలోపు నమోదు చేయబడాలి. రిజిస్ట్రార్ బైలాలో ఈ సవరణ సమాఖ్య ప్రయోజనం రీత్యా లేదా సహకార ఉద్యమం రీత్యా అవసరమని భావించితే ఆమె / అతను ప్రత్యేక సమయం యివ్వవచ్చు. ఒకవేళ సొసైటీ నిర్దేశించిన సమయంలో ఆ సవరణను స్వీకరించడంలో విఫలమైతే - సొసైటీకి విన్నవించుకునే అవకాశం కల్పిస్తూ - తర్వాత ఆ సవరణను నమోదు చేయవచ్చు.

సమాఖ్య ఎప్పుడైనా తన లక్ష్యాలను మార్చుకోవాలంటే, పాలకమండలి మరియు డైరెక్టర్లు ఆ సమస్యపై సమావేశం నిర్వహించాలి. దానిలో ప్రస్తుత లక్ష్యాలు, మార్చుచేయ ప్రతిపాదించిన లక్ష్యాలు, కొనసాగించే లక్ష్యాలపై చర్చ నిర్వహించాలి. కొత్త లక్ష్యాలు బై-లాలలో చేర్చాలి. దీనితో పాటు, ఒక వేళ సమాఖ్య ప్రస్తుతమున్న పాలకమండలి సభ్యులు మరియు డైరెక్టర్లతో చర్చించాలి. పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న తర్వాత, బై-లా తీర్మానాన్ని వారితో మార్పించి మరియు రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పు తీర్మానాన్ని సమర్పించాలి. దీనికి రుసుం రూ. 1000/-. సమాఖ్యను ఏర్పరచుటకు పాటించే పద్ధతులనే అనుసరించాలి. తీర్మానాన్ని రిజిస్ట్రారు పరిశీలించి సంతకం చేసిన తర్వాత ధృవీకరణ పత్రం యిస్తారు.

**సమాఖ్య యొక్క సభ్యత్వం:**

1. సమాఖ్య / గ్రామస్థాయి సంఘం నమోదు చేయడానికి ప్రతిపాదించే సభ్యులసంఖ్య వారి పేర్ల వివరాలు. దీని తర్వాత పాలకమండలి (GB) నిర్ణయానికి అనుగుణంగా సభ్యత్వం సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం చేయవచ్చు. సమాఖ్య / గ్రామస్థాయి సంఘం పాలకమండలి ఆమోదం ప్రకారం, సమాఖ్య / గ్రామస్థాయి సంఘం యొక్క సభ్యత్వంనకు యుక్త వయస్సు దాటి ఈ రంగానికి కావల్సిన తగిన విద్యార్హతలు ఉన్న వారందరు అర్హులే. నామినేట్ చేయబడిన సభ్యులు పాలకమండలి ఆమోదం పొందాలా అన్న అనుమానం అవసరంలేదు.

2. సమాఖ్య / గ్రామస్థాయి సంఘం యొక్క పాలకమండలి (GB) ధరఖాస్తుదారుని సభ్యత్వాన్ని ఆమోదించని యెడల, ఆ వ్యక్తికి సభ్యత్వ తిరస్కరణకు గల కారణాలను తెలియజేయాలి.

3. సమాఖ్య / VLS పాలకమండలిలో ఈ క్రింది తరగతులకు చెందిన సభ్యులుండాలి.

• స్థాపక సభ్యులు.

• నామినేటెడ్ సభ్యులు

• గౌరవ సభ్యులు

ఎట్టి పరిస్థితులలోనూ సమాఖ్య / గ్రామస్థాయి సంఘం సభ్యత్వం ఏడుగురి కంటె తగ్గొద్దు.

**పాలకమండలి (GB) మరియు విధులు:**

సమాఖ్య / VLS పాలకమండలిలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి మరియు ఇతర ఆఫీస్ బేరర్లు (కార్యనిర్వాహకవర్గ సభ్యులు) కలిపి ఏడుగురికి తగ్గకుండ 9 మందికి మించకుండ ఉండాలి.

• పాలకమండలి సమాఖ్య / VLS వ్యవహారాలను అజమాయిషీ చేయాలి.

• పాలకమండలి సమాఖ్య / VLS పైన పర్యవేక్షణ, యాజమాన్యం మరియు నియంత్రణ కలిగియుండాలి.

• పాలకమండలి నిర్ణయానుసారం పాలకమండలి సమావేశం పిలువడానికి ఎజెండా, సమావేశం తేదీ, సమయం మరియు సమావేశస్థలం తెలియజేస్తూ 15 రోజుల ముందు నోటీసు యివ్వాలి.

• పాలకమండలికి ఎన్నికైన వ్యక్తి చేతిఖర్చులను మినహాయించి ఎటువంటి వేతనం తీసుకోరాదు.

• సభ్యుల చేత ఎన్నుకోబడిన పాలకమండలి కాలపరిమితి 2-3 సం॥రాలు.

• పాలకమండలి సమావేశాన్ని కనీసంగా నెలకొకసారి నిర్వహించాలి.

• సమాఖ్య / VLS కార్యక్రమాలు మరియు లావాదేవీలు అన్ని పాలకమండలి ఆమోదం పొందాలి.

**సభ్యుల యొక్క రిజిష్టరు:**

1. సమాఖ్య / గ్రామస్థాయి సంఘం ఈ క్రింది సమాచారంతో కూడిన సభ్యులందరి సమాచారంతో రిజిష్టరు నిర్వహించాలి.

• సమాఖ్య / VLS సభ్యులందరి పేర్లు, చిరునామాలు మరియు ఇతర అవసరమైన వివరాలన్నింటిని ఆయా సభ్యులు ఆమోదించబడిన తేది నుండి వ్రాయాలి.

• కాలానుగుణంగా సభ్యత్వంలో వస్తున్న మార్పులన్నింటిని పొందుపర్చాలి.

• పాలకమండలి ఎప్పటికప్పుడు నిర్ణయించే, అవసరమైన ఇతర సమాచారమంతా సమకూర్చాలి.

2. ఏ సభ్యుడు / సభ్యురాలు అయినా సభ్యులరిజిష్టర్‌లో సంతకాలు చేయకుండా సభ్యుడు / సభ్యురాలుగా గుర్తించబడరు మరియు సభ్యుల హక్కులను, ప్రత్యేక అధికారాలను అనుభవించడానికి వీలులేదు.

**సభ్యుని రద్దు:**

• ఒక సభ్యున్ని ఈ క్రింద పేర్కొన్న సందర్భాలలో రద్దు చేయవచ్చు.

• సభ్యుని మరణం సంభవించిన యెడల

• అతను వ్రాతపూర్వక రాజీనామా యిచ్చినపుడు.

• సంఘవ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నాడని రుజువైనపుడు.

• ఏదైనా కోర్టు ద్వారా నేరం చేసాడని / నేరారోపణ చేయబడ్డా లేదా మానసిక స్థితి బాగులేదని తీర్పు వెలువడినపుడు

• సమాఖ్య / VLS ఆశయాలు, లక్ష్యాలకు వ్యతిరేక ప్రచారం చేస్తున్నాడని నిరూపితమైనపుడు

• అతను / ఆమె వాయిదా తేదీ నుండి మూడు నెలలు సభ్యత్వం లేదా విరాళం చెల్లించడంలో విఫలమైనపుడు

• పాలకమండలి నిర్ణయాలను ధిక్కరించినపుడు లేదా నియమాలను ఉల్లంఘించినపుడు.

**సమాఖ్యలో సిబ్బంది నియామకము:**

SHG గ్రూపుల పరిమాణంను బట్టి వారు సమాఖ్యకు ఒక మేనేజరు, సమన్వయ కర్తలను మరియు స్వచ్ఛంద సేవకులను నియమించుకొంటారు.

• మేనేజరు సమాఖ్య యొక్క పూర్తి లావాదేవీలకు బాధ్యత వహించాలి.

• సమన్వయకర్త ఆయా గ్రూపులకు, గ్రామాలకు బాధ్యత వహించాలి.

• అతడు / ఆమె గ్రామాలలో SHGల పనివిధానం మరియు పొదుపులు, అంతర్గత అప్పులు మరియు చెల్లింపులు మొదలగు ఇతర కార్యక్రమాలు చూడాలి. సమన్వయ కర్త క్రింద ఐదారు గ్రామాలుంటాయి. అతడు / ఆమె ఆ గ్రామాలకు బాధ్యతవహించాలి.

• స్వచ్ఛంద సేవకుడు / వాలంటీర్ గ్రామానికి మరియు SHGల పుస్తకాలు, లావాదేవీలు నిర్వహించడానికి బాధ్యతవహించాలి. అతడు

పరిమితిలో అప్పు మంజూరు చేస్తారు మరియు ఇతర సానుకూల అవకాశాలు కల్పిస్తారు. అయిదు రోజులలోపు ప్రతిక్రియ తెలియజేస్తారు.

• SHG లేదా సభ్యుని నుండి తిరిగి చెల్లింపుగా వచ్చిన డబ్బును బ్యాంకులో జమచేయాలి.

**సమాఖ్య /VLS యొక్క ముద్ర:**

• సాధారణ ముద్ర కార్యదర్శి ఆధీనంలో ఉండాలి.

• పాలకమండలి తీర్మాణం యొక్క అధికారంతోనే ముద్రను వినియోగించాలి.

• ప్రతి ఒప్పందం లేదా పరికరానికి ముద్ర ఉపయోగించేటప్పుడు సమాఖ్య / VLS తరపున ఇద్దరు పాలకమండలి సభ్యులు మరియు కార్యదర్శి లేదా సమాఖ్య / VLS చేత అధికారం పొందినవ్యక్తి ధృవీకరించాలి. ముద్ర వినియోగించే వరుస క్రమాన్ని, దీనికోసం కేటాయించిన రిజిష్టర్‌లో పొందుపర్చాలి.

**సమాఖ్య యొక్క సమస్యలు:**

• SHG సభ్యులు అప్పులను వెనువెంటనే సక్రమంగా తిరిగి చెల్లించరు.

• సమూహాలు కూడా క్రమ పద్ధతిలో అప్పులు తిరిగి చెల్లించరు.

• నాయకులకు SHG సభ్యులకు అంతర్గత గొడవలు వస్తాయి.

• తీసుకున్న అప్పులను కేటాయించబడిన వాటికి కాకుండ ఇతర అవసరాల కోసం వినియోగించడం.

**జమాఖర్చులు మరియు రికార్డులు:**

ఆడిటర్ అనుమతించిన లేదా ప్రత్యేకించిన ఫారంలలోనే జమాఖర్చులు మరియు రికార్డులు నిర్వహించాలి. ఈ విషయంలో సమాఖ్య అకౌంటెంట్ మరియు ఆఫీస్‌బేరర్ల పాత్ర చాలా ముఖ్యమైంది. వారు అన్ని బిల్లులు మరియు జమాఖర్చుల లావాదేవీలు నిర్వహించాలి. ఒకవేళ లావాదేవీలు రూ. 50,000/- మించితే చార్టెడ్ అకౌంటెంట్ (CA) చేత ఆడిటింగ్ చేయించాలి మరియు ఓచర్, రసీదు, నగదు పుస్తకం, అప్పుల లెడ్జర్ మరియు సాధారణ లెడ్జర్ నిర్వహించే పుస్తకాలు ఛార్టెడ్ అకౌంటెంట్ (CA) కు సమర్పించాలి. ప్రతి సంవత్సరం జమాఖర్చులను ఆదాయ పన్నుశాఖ (IT) కు సమర్పించాలి.

**వార్షిక నివేధిక :-**

1. సమాఖ్య గ్రామస్థాయి సంఘం ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుండి మార్చి 31 వరకు ఉండాలి. గత వార్షికాదాయ స్టేట్‌మెంట్‌ను మరియు ఉంటే ఆడిట్ రిపోర్టును సమాఖ్య / గ్రామస్థాయి సంఘం కార్యాలయంలో అందరికీ కనిపించే స్థలంలో భద్రపరచాలి.

2. పాలకమండలి - సమాఖ్య / గ్రామస్థాయి సంఘం యొక్క పనిపై నివేదికను సంవత్సరానికి సంబంధిత ప్రభుత్వ అధికారి కోరినప్పుడు సమర్పించాలి. ఈ రిపోర్టులో సమాఖ్య / గ్రామస్థాయి సంఘం ముందుసంవత్సరపు పనులు, ఆ సంవత్సరానికి చెందిన ఆడిట్ చేయబడిన బ్యాలెన్స్‌షీట్ (జమాఖర్చులు తెలుపుతూ) ఉండాలి.

**నేరాలు మరియు శిక్షలు:**

• నేరాలు సహకారచట్టం పరిధిలోనికి వస్తాయి.

• పాలక మండలి (GB), సిబ్బంది మరియు సమాఖ్య / VLS యొక్క ఏ సభ్యుడైనా చేసిన పలురకాలైన పనులు లేదా తప్పులు వీటి క్రిందికి వస్తాయి.

• నిధుల దుర్వినియోగానికి రిజిస్ట్రార్ అనుమతితో ప్రాసిక్యూషన్‌లు ప్రారంభించుతారు, నేరాలకు చట్ట పరిధిలో చర్యలుచేపడుతారు.

• చేసిన నేరాలనుబట్టి శిక్షలుంటాయి.

**నిస్సహాయ వర్గాలు మరియు సన్నకారు వర్గాలు తమ అభివృద్ధి మరియు సాధికారత కోసం సమాఖ్యలు / గ్రామస్థాయి సంస్థలను నమోదు చేసుకొనుటకు SHG సమాఖ్యలు మార్గం సుగమం చేశాయి.** ✸


లక్ష్మీదేవి పిండి గిర్ని









